జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
మంగళవారం 12 మే 2026 పేజీలు : 8



## ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి




# మూడు నెలలుగా సరఫరా చెయ్యని మిషన్ భగీరథ నీళ్లు



సిబ్బంది నిర్లక్ష్యం మా?
అధికారుల పర్యవేక్షణ లోపం?
త్రాగు నీటి కోసం బెజ్జూర్ గ్రామపంచాయతీ ఎదుట మహిళలు ఖాళీ బిందెల తో నిరసన ధర్నా, ఆందోళన
మహిళల మద్దతు పలికిన త్రాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేసిన సమాచార హక్కు రక్షణ చట్టం 2005, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి లింగయ్య:




## మంచిర్యాల ఆర్టీసీ డిపోలో డ్రైవర్ల నిరసన



మంచిర్యాల ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో తప్పుడు రీడింగ్స్ వస్తున్నాయని ఆరోపిస్తూ ఆర్టీసీ డ్రైవర్లు సోమవారం భారీ నిరసన చేపట్టారు. తాము మద్యం సేవించకపోయినా బ్రీత్ అనలైజర్ యంత్రాలు పాజిటివ్ రీడింగ్స్ చూపిస్తున్నాయని, అలాంటి కారణాలతో విధుల్లోకి అనుమతించడం లేదని డ్రైవర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచే డిపో ఎదుట డ్రైవర్లు ఆందోళన ప్రారంభించారు. కొంతమంది డ్రైవర్లకు 56కు పైగా రీడింగ్స్ రావడంతో అధికారులు విధుల్లోకి తీసుకోలేదని తెలిపారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీ గా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరా బాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.



# గంగాపూర్ కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ

## ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ హరిత చేతుల మీదుగా శంకుస్థాపన

## ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ఘన సన్మానం




**ఆసిఫాబాద్ మే 11 ప్రజా జ్యోతి** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలం గంగాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి జిల్లా కలెక్టర్ కె. హరిత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేజీబీవీలో విద్యార్థినుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత బాలికలు ఉన్నత విద్యలో రాణించేలా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. వారికి శాలువాలు కప్పి సన్మానించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కర్నాతం సంజీవ్, వైస్ చైర్మన్ రంగు మహేష్, మాజీ మండల అధ్యక్షులు పోటు శ్రీధర్ రెడ్డి, సర్పంచ్‌లు దుర్గం భరద్వాజ్, మాదాసు రవీందర్, ఉప సర్పంచ్‌లు జగదీష్ వరలక్ష్మి, మామిడి లక్ష్మి, నాయకులు మధునయ్య, బుర్స పోచమల్లు, అరుణ మురళి గౌడ్, పద్మ, విలాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, పాఠశాల యాజమాన్యం, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# మైనర్ బాలిక కేసులో బండి సంజయ్, కుమారుడిని అరెస్టు చేయాలి

## బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

## నడిపెల్లి విజిత్ కుమార్



**మంచిర్యాల, 11,మే (ప్రజా జ్యోతి):** మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, ఈ వ్యవహారంలో బండి సంజయ్‌ను కూడా బాధ్యుడిగా గుర్తించాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నివాసం (ఎల్ఐసీ కాలనీ) వద్ద సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి కేంద్ర మంత్రి అనే అహంకారంతో మైనర్ బాలికపై బండి సాయి భగీరథ్ దుర్మార్గంగా వ్యవహరించాడని ఆరోపించారు. బాధితురాలికి న్యాయం చేయాల్సింది పోయి, సంబంధం లేని ప్రాంతాలైన నిర్మల్, కరీంనగర్‌లలో కేసులు నమోదు చేయడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బండి సాయి భగీరథ్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నా రని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని బీజేపీ లోకి ఆహ్వానించడం ఇందుకు ఉదాహరణ అని అన్నారు. బీజేపీ మతాన్ని అడ్డుపెట్టు కొని రాజకీయాలు చేస్తోందని, మహిళలు, దళితుల పట్ల ఆ పార్టీకి గౌరవం లేదని ఆరోపించారు. కొడుకు తప్పును కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్న బండి సంజయ్‌ను ఏ-1గా గుర్తించి కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా బాధిత కుటుంబం పోరాడు తున్నా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం ప్రభుత్వం, పోలీసుల వైఖరికి నిదర్శనమన్నారు. మూడు రోజుల క్రితం కేసు నమోదై నప్పటికీ ఇప్పటివరకు అరెస్టు జరగకపోవడంపై ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా పనిచేస్తోందని ఆరోపించిన ఆయన, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, గంగుల కమలాకర్ కార్యాలయాలపై జరిగిన దాడులను ప్రస్తావించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇటువంటి ఘటనలు ఎప్పుడైనా జరిగాయా అని ప్రజలు ఆలోచించాలని అన్నారు. బీజేపీ హిందుత్వాన్ని కేవలం రాజకీయాల కోసం ఉపయోగిస్తోందని, కాళేశ్వరం వంటి పుణ్యక్షేత్రాన్ని "కూళేశ్వరం"గా వ్యాఖ్యానించడం బీజేపీ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మీడియా ఛానళ్లను కొనుగోలు చేయడం మానేసి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. బండి సంజయ్, ఆయన కుమారుడిపై వెంటనే చర్యలు తీసుకోకపోతే బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, మాజీ ప్రజాప్రతి నిధులు, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జన్నారంలో సమ్మర్ క్యాంపు ప్రారంభం

--డ్యాన్స్, కుట్లు, అల్లికల్లో శిక్షణ



**జన్నారం,మే11(ప్రజాజ్యోతి)** ప్రజా-పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా ఈనెల 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలు జరుగుతాయని ఎంఈఓ విజయ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (బాలికలు)లో సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ క్యాంపులో పాల్గొనవచ్చని ఎంఈఓ పేర్కొన్నారు. డ్యాన్స్, కుట్లు-అల్లికలు, యోగాతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మా-భూమేష్, ఉపసర్పంచ్ అప్పాల జలపతి, ఎంఈఓ విజయ్ కుమార్ ,ప్రధానోపాధ్యాయులు డి.రామన్న, ఏఏపీసీ ఛైర్‌పర్సన్ ఎన్. సుజాత, నాయకులు మోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,న్యాయవాది రమేష్, ఉపాధ్యాయు రాలు పద్మజ, సీఆర్‌పీ దయాకర్, ఇన్‌స్ట్రక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సిర్పూర్ (టి) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 7 రోజుల కార్యాచరణ లో విద్య వారోత్సవాలు ప్రారంభం,ఘన నిర్వహణ

ఇన్చార్జి ప్రిన్సిపాల్ సిహెచ్ తిరుపతి:




**మే 11 సిర్పూర్ (టి) నియోజక వర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా7 రోజుల కార్యచరణ ప్రణాళికలో మొదటి రోజు విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగిందని ఇన్చార్జి ప్రిన్సిపాల్ సిహెచ్ తిరుపతి తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ సిహెచ్ తిరుపతి స్వాగత ప్రసంగం చేశారు. సిర్పూర్ (టి) ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ సిహెచ్ తిరుపతి మాట్లాడుతూ. కళాశాల అభివృద్ధితో పాటు విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలు అదేవిధంగా విజయాలను ప్రతిబింబించే బ్రోచర్లు పోస్టర్లు పాంప్లెంట్లను విడుదల చేశామని అన్నారు. ఐఆఫ్పిఎస్/ ఐడిపిఎస్ ఇంట్రాక్టివ్ ఇంట్రాక్టివ్ డిస్ప్లేపానల్ సిస్టం, అదేవిధంగా ఇంటర్ ఆక్టివ్ సిస్టంను అధ్యాపక బృందంతో కలిసి ప్రారంభించడం జరిగిందని అన్నారు. సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ సర్పంచ్ ఓడ్డేటి నాగమణి సభను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కార్యక్రమాలు, కళాశాల విద్యార్థులు సాధించిన అద్భుతమైన ఫలితాలు, నాణ్యమైన విద్య యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు వడ్డేటి నానయ్య, అధ్యాపకులు ఆసిఫ్, భూపెల్లి తిరుపతి, రమేష్, యాకూబ్ పాషా, రవి, ఘన శ్యామ్, శ్యామ్ మూర్తి, హర్షిత, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలి

## పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ మంచిర్యాల డివిజన్ కో-ఆర్డినేటర్ ఎన్. డిసీల్ కుమార్



**మంచిర్యాల, 10,మే (ప్రజా జ్యోతి):** విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలని పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ మంచిర్యాల డివిజన్ కో-ఆర్డినేటర్, సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్. డిసీల్ కుమార్ సూచించారు. ఈ నెల 13న బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ నున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్--2026)కు సంబంధించి మంచిర్యాల జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయని సోమవారం తెలిపారు.మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగుతుందని, "ఒక్క నిమిషం నిబంధన" కఠినంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పరీక్షకు మంచిర్యాల డివిజన్ పరిధిలో మొత్తం 2 వేల 364 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఇందుకోసం మంచిర్యాల, నస్పూర్ ప్రాంతాల్లో మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి స్తామని,విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకొని ఎలాంటి హడావుడి లేకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. ఓఎంఆర్ షీట్‌లోని వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నింపాలని తెలిపారు. విద్యార్థులు తమ వెంట ఎచ్. బి /2బి బ్లాక్ పెన్సిల్, బ్లూ లేదా బ్లాక్ పెన్ తప్పనిసరిగా తీసుకు రావాలని సూచించారు.ఉదయం 11 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించ బోమని స్పష్టం చేశారు. హాల్ టికెట్‌పై ఫోటో ప్రింట్ కాని వారు ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు.సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పరీక్షా కేంద్రాల్లో అనుమతించ బడవని తెలిపారు. అత్యంత పకడ్బందీగా నిర్వహించే ఈ పరీక్షకు విద్యార్థులు సకాలం లో హాజరై ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసి మంచి ఫలితాలు సాధించాలని పాలిసెట్ మంచిర్యాల డివిజన్ కో-ఆర్డినేటర్ ఎన్. డిసీల్ కుమార్ ఆకాంక్షించారు.

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**మంచిర్యాల, 11, మే (ప్రజా జ్యోతి):** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్క రించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు లతో కలిసి అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.నస్పూర్ మండలం సింగాపూర్ గ్రామానికి చెందిన కోట శంకర్ తాను జైపూర్ మండలం ఇందారం గ్రామ శివారులో 10 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన భూమిని తన పేరిట జమాబందీ చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు.దండేపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన అయ్యోరి లిఖిత తాము జీవనోపాధి కోసం టాక్సీ నడుపుకుంటున్నామని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎల్-3లో ఉన్న తమ వివరాలను ఎల్-1లో చేర్చి ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన కారుకూరి మల్లయ్య వృద్ధులైన తమ ఆస్తులను పిల్లలు అక్రమంగా తమ పేరిట పట్టా మార్చుకుని ఇంటి నుండి వెళ్లగొట్టారని, ఆ పట్టాలను రద్దు చేసి భూములను తిరిగి తమ పేరిట మార్చాలని విజ్ఞప్తి చేశారు.భీమిని మండలం మల్లిడి గ్రామానికి చెందిన పుల్లూరి చంద్రశేఖర్ గ్రామపం చాయతీ పరిధిలో క్రిమిటోరియం పనులు చేసినప్పటికీ బిల్లులు చెల్లించలేదని, వెంటనే డబ్బులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.కాసిపేట మండలం లంబడి తండా గ్రామానికి చెందిన బానోత్ రాజేష్ తమ గ్రామం పాత గ్రామపంచాయతీ నుండి వేరు అయిన నేపథ్యంలో ప్రత్యేక రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కోరారు. మందమర్రి మండలం చిర్రగుంట గ్రామానికి చెందిన వొడ్నాల కొమురయ్య తమ వ్యక్తిగత భూమిలో అనుమతి లేకుండా చేపడుతున్న సీసీ రోడ్ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత...



**జన్నారం,మే11(ప్రజాజ్యోతి)**మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన దాసరి లింగన్న ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు దాసరి లింగన్న నిరుపేద కుటుంబానికి చెందినవాడు కావడంతో, ఆయన కుటుంబానికి పూర్ణచంద్రరావు(పీసీఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం 50 కేజీల బియ్యాన్ని ఫౌండే షన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమం లో ఫౌండేషన్ సభ్యులు, నోముల రాజ్ కుమార్, బోట్ల సంజీవ్, రాజేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి సీనియర్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్

**మంచిర్యాల, 11, మే (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్ ఈ నెల 23 నుండి 26వ తేదీ వరకు హైదరాబాద్‌లోని మన్సూరాబాద్‌లో గల మల్లికార్జున నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్. బాలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి. రాజన్న లు తెలిపారు.రంగారెడ్డి జిల్లా క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్, డబుల్స్, మహిళల సింగిల్స్, వెటరన్ పురుషుల సింగిల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ పోటీల్లో పాల్గొనదలి చిన క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈ నెల 18వ తేదీలోగా పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440010 404 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 11, మే (ప్రజా జ్యోతి):** ఎల్.ఆర్. ఎస్. దరఖాస్తులు, రుసుములు, చెల్లింపులపై రాయితీ, దరఖాస్తుల పరిష్కారం కోసం జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం జూలై 31వ తేదీ వరకు ఎల్.ఆర్.ఎస్. రుసుములు, చార్జీల చెల్లింపుపై 25 శాతం రాయితీ కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కార్యాలయ పని వేళలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దరఖాస్తుదారులు మరిన్ని వివరాలకు 08736-250501 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ గెజిట్‌లో 'నేతకాని' కుల పేరు సవరణ చేయాలి

**మంత్రి వివేక్‌ను కోరిన నేతకాని సేవా సంఘం నాయకులు**



**మంచిర్యాల, మే 11 (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ గెజిట్‌తో పాటు అధికారిక రికార్డుల్లో "నేతకాని" కుల పేరును సరిచేయాలని నేత కాని (మహర్) సేవా సంఘం నాయకులు రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామిని సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు.ప్రస్తుతం కొన్ని అధికారిక పత్రాలు, నమోదు ప్రక్రియల్లో "నేతకాని"కు బదులుగా "మలసాలె/ నెట్కాని"గా నమోదు అవుతోందని, ఇది తప్పు నమోదుగా మారి సమాజానికి చెందిన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని సంఘం ప్రతినిధులు వివరించారు.రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి, దుర్గం సిద్ధార్థ రామ్మూర్తి సమర్పించిన వినతిపత్రం లో నేతకాని కులానికి చెందిన ప్రజలు ఖమ్మం, మంచిర్యాల, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని సుమారు 35 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్నారని తెలిపారు. అధికారిక రికార్డులు, గెజిట్ ప్రక టనలు, కుల ధృవీకరణ పత్రాల్లో "నేతకాని" పేరునే ఏకరీతిగా నమోదు అయ్యేలా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని వారు మంత్రిని కోరారు.ఈ సందర్భంగా మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి స్పందిస్తూ, సంబంధిత అధికారులతో ఈ అంశంపై చర్చించి అవసరమైన సవరణలు చేయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బహుజన బంధువులారా ఏకం కండి.. ఏనుగు ప్రభుత్వాన్ని స్థాపిద్దాం

**పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జులు కాదాసి రవీందర్, వరికిల్ల మల్లేష్ పిలుపు**



**మంచిర్యాల, 11, మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ ప్రాంగణంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జిల్లా సమీక్ష సమావేశాను సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జులు కాదాసి రవీందర్, వరికిల్ల మల్లేష్ లు మాట్లాడు తూ, జిల్లాలో పార్టీని గ్రామ గ్రామాన విస్తరింపజేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 13న జరగనున్న వరంగల్ జోన్–2 సమీక్ష సమావేశానికి మంచిర్యాల జిల్లా కమిటీతో పాటు జిల్లాలోని మూడు నియోజకవర్గాల కమిటీల నాయకులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. "బహుజన బంధువులారా ఏకం కండి.. రానున్నది ఏనుగు ప్రభుత్వమే" అని వారు అన్నారు.అనంతరం పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జిల సమక్షంలో బండారి రాజ్‌కుమార్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. అలాగే బండారి రాజ్‌కుమార్, పులాల రమేష్‌లను మంచిర్యాల నియోజకవర్గ ఇంచార్జిలుగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ సభ్యుడు నాగుల కిరణ్‌బాబు, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు దాగం శ్రీనివాస్, చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు గాజుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల ఆర్టీసీ డిపోలో డ్రైవర్ల నిరసన

**డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో తప్పుడు రీడింగ్స్ వస్తున్నాయంటూ ఆగ్రహం**
**విధుల్లోకి అనుమతించకపోవడంపై డ్రైవర్ల నిరసన**
**500 మందికి పైగా డ్రైవర్లు సమ్మెలో పాల్గొన్నట్లు వెల్లడి**
**బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికుల అవస్థలు**



**మంచిర్యాల, 10, మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో తప్పుడు రీడింగ్స్ వస్తున్నాయని ఆరోపిస్తూ ఆర్టీసీ డ్రైవర్లు సోమవారం భారీ నిరసన చేపట్టారు. తాము మద్యం సేవించకపోయినా బ్రీత్ అనలైజర్ యంత్రాలు పాజిటివ్ రీడింగ్స్ చూపిస్తున్నాయని, అలాంటి కారణాలతో విధుల్లోకి అనుమతించడం లేదని డ్రైవర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచే డిపో ఎదుట డ్రైవర్లు ఆందోళన ప్రారంభించారు. కొంతమంది డ్రైవర్లకు 56కు పైగా రీడింగ్స్ రావడంతో అధికారులు విధుల్లోకి తీసుకోలేదని తెలిపారు. అయితే తాము డ్యూటీకి మద్యం సేవించి రాలేదని, యంత్రాల్లో లోపాల వల్లే తప్పుడు రిపోర్టులు వస్తున్నాయని డ్రైవర్లు వాపోయారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ, "పది నిమిషాల ముందు ఒకలా, పది నిమిషాల తర్వాత మరోలా రీడింగ్స్ చూపిస్తున్నాయి. రీడింగ్ తప్పు వచ్చినప్పుడల్లా డ్రైవర్లను పక్కకు పెట్టి సస్పెండ్ చేయడం, హరాస్‌మెంట్ చేయడం, డ్యూటీలోకి తీసుకోకపోవడం జరుగుతోంది" అని ఆరోపించారు. ప్రైవేట్ డ్రైవర్లను ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికే ఇద్దరు ముగ్గురు డ్రైవర్లు సస్పెండ్ అయి ఉన్నారని తెలిపారు. "మిషన్‌లో ప్రాబ్లం ఉందని మేము చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మిషన్ రిపోర్టు పంపిస్తామని అధికారులు చెబుతున్నారు. మిషన్ తప్పు అయితే విధుల్లోకి తీసుకుంటామని, తప్పు కాకపోతే పనిష్మెంట్ ఇస్తామని మాట్లాడుతున్నారు" అంటూ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఒకరోజు సమ్మె చేస్తామని యాజమాన్యానికి ముందుగానే తెలిపామని, డ్యూటీలోకి తీసుకుంటేనే బస్సులు బయటికి తీస్తామని స్పష్టం చేశారు. డిపోలో అద్దె బస్సులు, కార్పొరేషన్ బస్సులు అన్నీ నిలిచిపోయాయని తెలిపారు. సుమారు 130 మంది ప్రైవేట్ డ్రైవర్లు, కార్పొరేషన్ డ్రైవర్లతో కలిసి మొత్తం 500 మందికి పైగా డ్రైవర్లు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఒక డ్రైవర్ మద్యం సేవించలేదని చెబుతున్నప్పటికీ పరీక్షలో పాజిటివ్ రిపోర్టు రావడం వివాదానికి దారితీసింది. తాను ఎప్పుడూ క్రమశిక్షణతో విధులకు హాజరవుతానని, రెండు సార్లు ఉత్తమ డ్రైవర్ అవార్డు అందుకున్నానని ఆయన తెలిపారు. అలాంటి వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదని సహచర డ్రైవర్లు అన్నారు. ఇదే తరహాలో మరో డ్రైవర్‌కు మొదట పాజిటివ్ రిపోర్టు రాగా, రెండోసారి పరీక్షించగా నెగెటివ్ రావడంతో బ్రీత్ అనలైజర్ యంత్రాల పనితీరుపై అనుమానాలు మరింత పెరిగాయి. గతంలో 73 పాయింట్లు వచ్చిన ఓ డ్రైవర్‌ను విధుల్లోకి అనుమతించిన ఘటనను ప్రస్తావిస్తూ అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబి స్తున్నారని ఆందోళనకారులు మండిపడ్డారు. బ్రీత్ అనలైజర్ యంత్రాలను వెంటనే రీ-క్యాలిబ్రేట్ చేసి, తప్పుడు రిపోర్టులపై విచారణ జరపాలని డ్రైవర్లు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కావాలని కోరుతున్నామని, తమ సాధ్యమైనంత వరకు యాజమాన్యానికి సహకరిస్తామని తెలిపారు. "డ్రైవర్లమంతా ఒకటిగా చేరి సమస్య త్వరగా పరిష్కారం కావడానికి చర్చించు కుంటున్నాం" అని తెలిపారు . డ్రైవర్ల నిరసనతో డిపోలో బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న మంచిర్యాల సీఐ ప్రమోద్ పోలీసు బందోబస్తుతో అక్కడికి చేరుకుని పరిస్థితిని శాంతి భద్రతలను సమీక్షించారు. ఇదిలా ఉండగా డ్రైవర్లు, డిపో అధికారులతో చర్చలు జరిపినా సమస్య ఒక కొలిక్కి రాకపోవడంతో మధ్యాహ్నం దాటిన తర్వాత కూడా నిరసన కొనసాగింది.

# డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలి

**మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు**



**మంచిర్యాల, 11,మే (ప్రజా జ్యోతి):** డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు కేటాయించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు డిమాండ్ చేశారు.మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో 2023 మార్చి 17న పద్మావతి గార్డెన్స్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం లాటరీ నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 1600 మంది లబ్ధిదారులలో అర్హులైన 330 మంది పేద కుటుంబాలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశామన్నారు.ఆ సమయంలో జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారులు, మీడియా సమక్షంలో పారదర్శకంగా లాటరీ నిర్వహించబడిందని తెలిపారు. లబ్ధిదారులు తప్ప ఇతరులను ప్రాంగణంలోకి అనుమతించవద్దని తాము సూచించామని, అందుకే తాము మరియు ఇతర ప్రజాప్రతినిధులు లక్కీ డ్రా కార్యక్రమంలో పాల్గొనలేదని చెప్పారు.గత రెండున్నర సంవత్సరాలుగా ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని నిరంతరం విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల మళ్లీ కొత్తగా లాటరీ నిర్వహించాలని ప్రతిపాదన లు వస్తున్నాయని, ఇది ఇప్పటికే ఎంపికైన అర్హులైన పేదలకు అన్యాయం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.అప్పట్లో ఎంపికైన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అంకితభావంతో పనిచేస్తూ కార్మిక ఉద్యమంలో విశిష్ట గుర్తింపు పొందిన సీనియర్ కేంద్ర నాయకుడు జెట్టి శంకర్రావు

## శ్రమ శక్తి అవార్డు గ్రహీత శంకర్రావు ఘనంగా సన్మానం




**మంచిర్యాల, 11, మే (ప్రజా జ్యోతి):** అంకితభావంతో పనిచేస్తూ కార్మిక ఉద్యమంలో విశిష్ట గుర్తింపు పొందిన సీనియర్ కేంద్ర నాయకుడు జెట్టి శంకర్రావు అని పలువురు వక్తలు కొనియాడారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే-1ఏ, ఐకే ఓపెన్ కాస్ట్ గని కార్మికులు, అధికారులు "శ్రమశక్తి అవార్డు గ్రహీత" జెట్టి శంకర్రావును సోమవారం ఘనంగా సన్మానించారు. ఐఎన్టీయూసీ యూనియన్ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు ఐకే-1ఏ, ఐకే ఓపెన్ కాస్ట్ గని కార్మికులను, గని అధికారులను మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భంగా, గని కార్మికులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక "శ్రమశక్తి అవార్డు"ను 2026 మే 1న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో అందుకున్న సందర్భంగా, సోమవారం రెండవ బదిలీ సమయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఇందారం ఐకే-1ఏ, ఐకే ఓపెన్ కాస్ట్ గని అధికారులు, ప్రాజెక్టు ఆఫీసర్ ఏవీ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ నాగన్న, ఐకే ఓపెన్ కాస్ట్ మేనేజర్ శంకర్, కొండయ్య తదితరులు పూల బొకేలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. గత నాలుగు దశాబ్దాలుగా ఐఎన్టీయూసీ యూనియన్ లో అంకితభావంతో పని చేస్తూ కార్మిక ఉద్యమంలో విశిష్ట గుర్తింపు పొందిన సీనియర్ కేంద్ర నాయకుడు, మృదుస్వభావి, సింగరేణి కార్మికుల వెన్నంటి నిలిచే ట్రేడ్ యూనియన్ ప్రతినిధిగా జెట్టి శంకర్రావు సేవలందిస్తున్నారని పలువురు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక "శ్రమశక్తి అవార్డు"ను రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు ఊ భూగర్భశాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా అందుకోవడం పట్ల ఇందారం ఐకే-1ఏ, ఐకే ఓపెన్ కాస్ట్ గని కార్మికులు, అధికారు లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గని కార్మికులు, అధికారులు, ట్రేడ్స్‌మెన్ సోదరులు, మైనింగ్ సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు, మహిళా ఉద్యోగిణులు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నాలుగు దశాబ్దాలుగా జెట్టి శంకర్రావు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంలో ఆయన ఎల్లప్పుడూ ముందుండి చురుకైన పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. అలాంటి నాయకుడికి ఈ అవార్డు లభించడం గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో కూడా జెట్టి శంకర్రావు మరిన్ని ఉన్నత పదవులను అధిరోహిస్తూ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జెట్టి శంకర్రావు మాట్లాడుతూ, తాను ఈ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడానికి గత 40 సంవత్సరాలుగా తనపై విశ్వాసం ఉంచిన సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, సూపర్వైజర్లు, ట్రేడ్స్‌మెన్, మైనింగ్ స్టాఫ్ మరియు అధికారుల సహకారమే కారణమని తెలిపారు. అలాగే ఈ అవార్డు సాధనకు కృషి చేసిన ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకే1ఏ గని, ఐకే ఓపెన్ కాస్ట్ కార్యదర్శులు ఈ భీమయ్య, జంగం మధు, ఏరియా కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ పిట్ కార్యదర్శులు ఉదయ్, రామకృష్ణ, ఐఎన్టీయూసీ నాయకులు సతీష్, అశోక్, జాకిర్ హుస్సేన్, లింగమూర్తి, ప్రవీణ్, కె. శ్రీనివాస్, సోమయ్య, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

## రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి




**మంచిర్యాల,11,మే ( ప్రజా జ్యోతి ):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీ గా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ, రాష్ట్రంలో త్వరలో చేపట్టే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు ప్రతి ఇంటింటిని సందర్శించి వివరాలు సేకరించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారుల వివరాలను ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయాలని, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారం తీసుకోవా లన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించా లని, మ్యాపింగ్ ప్రక్రియపై వారి అనుమానాలను నివృత్తం చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8లను త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు చేపడు తున్నామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు జారీ చేశామని చెప్పారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని, ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో మ్యాపింగ్ చేసుకునేలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో స్పష్టమైన జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం లో భాగంగా ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని స్వీకరించి

## చట్ట ప్రకారం త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్:బిబి




**మే 11, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాజ్యోతి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజా ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ నితిక పంత్. అనంతరం వారు ప్రజా ఫిర్యాదు దారుల సమస్యలను ఓపికగా విని పరిష్కరి స్తామని ఫిర్యాదు దారుల ను హామీ కల్పించారు. అనంతరం జిల్లా ఎస్పీ నీతిక పంత్ మాట్లాడుతూ గ్రీవెన్స్ వచ్చి తమ ఫిర్యాదులను ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందించిన ఫిర్యాదు దారుల సమస్యలను చట్టప్రకారం త్వరితగతిన వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా జిల్లాలో ని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం10 ఫిర్యాదులు స్వీకరించామని అన్నారు సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారుల తో చరవాణి ద్వారా మాట్లాడి అవసర మైన సూచనలు చేశారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, జిల్లా ఎస్పీ నీతిక పంత్ ప్రజలను సూచించారు. ప్రతి సోమవారం నిర్వ హించే ప్రజా వాణి కార్య క్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నీతిక పంత్ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు అండగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని జిల్లా ఎస్పీ నీతిక పంత్ తెలిపారు.

# చింతలమానేపల్లి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎం.కమలాకర్




**మే 11, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియో జకవర్గంలో ని చింతల మానే పల్లి మండల పోలీ స్ స్టేషన్ లో ఎస్సై ఎం. కమలాకర్ పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ..విధుల పట్ల అంకిత భావంతో నిస్వార్థంగా ప్రజల కు జవాబు దారితనంగా నిర్వహిస్తూ నిరుపేదలకు అండగా సామాన్య మానవునికి తోడుగా మధ్యతరగతి వారికి ధైర్యంగా ఉంటూ చట్టాలకు అతీతంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలను రక్షిస్తా నని అన్నారు. ఆసాంఘిక కార్యకలాపాలకు విరుద్ధం గా ఎంతటి వారి కైనా ఉపేక్షించేది లేదని అన్నారు. సట్కా, మట్కా, గాంజా, మద్యం,జూదం,తో పాటు ఎలాంటి అక్రమ కార్యకలపాలను రూపు మాపి నివారించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఆసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా కొనసాగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ప్రజలు తనను సహకరించాలని అన్నారు.

## ఏప్రిల్ నెల పారితోషికం వెంటనే విడుదల చేయాలి

**కనీస వేతనం 18 వేలు అమలు చేయాలి**

**అధికారులకు వినతి**

**ఎస్. సమ్మక్క ఆశా యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు**



**మంచిర్యాల,11,మే (ప్రజా జ్యోతి):** ఆశా యూనియన్ సీఐటీయూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఏప్రిల్ నెల వేతనం విడుదల చేయడంతో పాటు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏవో, జిల్లా డీఎం,హెచ్‌వో కార్యాలయము సూపరింటెండెంట్ లకు వేర్వేరుగా వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్. సమ్మక్క ఆశా యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కనీస వేతనం 18 వేలను అమలు చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం పెంచిన 1500 లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 50 లక్షల ఇన్సూరెన్స్, 50 వేలను అంత్యక్రియల ఖర్చు అమలు చేయాలని కోరారు.అలాగే పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని, ఏఎన్ఎం, జీఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశా కార్యకర్తల కు ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## గృహప్రవేశ కార్యక్రమంలొ పాల్గొన్న సుగుణక్క

**కొత్త ఇంట ఆయురారోగ్యాలు కలగాలి**

**: డీసీసీ అధ్యక్షురాలు**



**ఆసిఫాబాద్, మే 11:ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ పట్టణం సందీప్ నగర్‌లో సోమవారం నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క గృహప్రవేశ కార్యక్రమంలి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గృహ యజమానులు చునార్కర్ వనిత–వసంతరావు దంపతులకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషాన్ని పంచుకున్న సుగుణక్క, కొత్త ఇంటిలో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్లు తరిఖ్, భీమ్ రావ్, ప్రధాన కార్యదర్శులు చిన్న మల్లేష్, విజయ్ కుమార్, డీసీసీ ఆఫీస్ ఇంచార్జి శంకర్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చునార్కర్ వసంత్ రావ్, దీపక్, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పపెల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**సర్పంచ్ బసవయ్య చేతుల మీదుగాప్రారంభోత్సవం**




**ఆసిఫాబాద్ మే 11 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలం అప్పపెల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ వాసుదేవన బసవయ్య, ఎస్‌హెచ్‌జీ సీసీ శంకర్, ఎస్‌హెచ్‌జీ వీఓఏ కవిత కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బసవయ్య మాట్లాడుతూ 'గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389, సాధారణ గ్రేడ్‌కు రూ.2,320 మద్దతు ధరతో కొనుగోలు చేస్తారని తెలిపారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ అందుతుందని చెప్పారు. రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్నే సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు సుధాకర్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని నిర్వాహకులు కోరారు.

## లంజనివీరలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**యూరియా వాడకం తగ్గించాలి**

**: శాస్త్రవేత్త డా. సౌజన్య**



**ఆసిఫాబాద్ మే 11 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండలం లంజనివీర గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్య, ఏఈఓ పరిమళ, సర్పంచ్ పవన్, ఉప సర్పంచ్ విట్టల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. సౌజన్య మాట్లాడుతూ రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి పంట మార్పిడి విధానాలు పాటించాలన్నారు. పచ్చి రొట్టె ఎరువుల వాడకం పెంచాలని, పంట వ్యర్థాలను కాల్చకుండా వేసవి దుక్కిలో కలియదున్నాలని సూచించారు. నిషేధిత పురుగుమందుల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు.నీటి యాజమాన్యం, కూరగాయ పంటల్లో కోతల మధ్య పిచికారి పద్ధతి, నేలలో సేంద్రీయ పదార్థాలు పెంచే మార్గాలపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయంతో భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## టీబి వ్యాధిపై అవగాహన



**జన్నారం,మే11(ప్రజాజ్యోతి)** టీబి ముక్తాభారత్ అభియాన్ కార్యక్రమంలో లో భాగంగా డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సుధాకర్ నాయక్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ ఆధ్వర్యంలో కొత్తపేట, కవ్వాల్ గ్రామ ప్రజలకు సోమవారం రోజున టీబి వ్యాధి పై అవగాహన కల్పించి 100మందికి ఎక్స్రేలు తీసి తెమడ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం సర్పంచులు దినేష్ నాయక్ ,సక్రు నాయక్ ఎం ఎల్ హెచ్ పి మౌనిక, టిబి సూపర్ వైజర్ సురేష్, ఏఎన్ఎం ప్రియాంక,ఎక్స్రే టెక్నీషియన్ రాజేష్, ఆశా కార్యకర్తలు లీల, సుజాత, నీరజ పాల్గొన్నారు.

## ఏప్రిల్ నెల పెండింగ్ వేతనం వెంటనే చెల్లించాలి

**అంగన్వాడి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

**"ప్రజావాణి"లో జిల్లా కలెక్టర్ కు అంగన్వాడి యూనియన్ సీఐటీయు వినతి**



**మంచిర్యాల, 11, మే (ప్రజా జ్యోతి):** అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన " ప్రజావాణి " కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ (సీఐటీయు) జిల్లా అధ్యక్షురాలు ఏ. భానుమతి మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.చేసిన శ్రమకు నెల నెలా వేతనాలు కూడా సక్రమంగా అందని పరిస్థితుల్లో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రీ–ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల అద్దెలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్లకు ఇటీవల ఇచ్చిన సెల్‌ఫోన్లు సరిగా పనిచేయడం లేదని, వాటిని వెనక్కి తీసుకుని అన్ని యాప్స్, సౌకర్యాలతో కూడిన మెరుగైన నెట్‌వర్క్ ఫోన్లు ఇవ్వాలని కోరారు.కేంద్ర శిశు సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం బీఎల్ఓ డ్యూటీలను రద్దు చేయాలని, ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులు అంగన్వాడీ సిబ్బందితో చేయించరాదని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రూ.18 వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తయినప్పటికీ హామీలను అమలు చేయకుండా, ఖాళీ పోస్టులను భర్తీ చేయక పోవడంతో పాటు అదనపు పనిభారాన్ని మోపుతూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను అనారోగ్య సమస్యలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు అనురాధ, హీరోనిక తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తూకం లో మోసం.

**40 కిలోలకు బదులుగా 43 కిలోల తూకం**




**జన్నారం,మే11(ప్రజాజ్యోతి)** వద్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తూకంలో మోసం జరుగుతుందని, 40 కిలోలకు బదులుగా 43 కిలోలు తూకం వేస్తున్నారని దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సిపిఎం జిల్లా నాయకుడు కనికారపు అశోక్ ఆరోపించారు.సోమవారం రోజున మండలంలోని పలు వరి కొనుగోలు కేంద్రాలతో పాటు మురిమడుగు కొనుగోలు కేంద్రాలను మండల సిపిఎం కమిటీతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కనికారపు అశోక్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ పై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేకుండా ఉందని, ధాన్యం అమ్ముకొనుటకు అన్నదాతలు హరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు, కొనుగోలు కేంద్రాల్లో ఒక బస్తాకు 40 కేజీల తూకం వేయాల్సి ఉండగా 43 కేజీల తూకం వేసి రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఒకే కాంటాతో కాకుండా రెండు కాంటాలు ఏర్పాటు చేసి తరుగు లేకుండా తూకం వేసి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కొండగొర్ల లింగన్న మాట్లాడుతూ దాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన తర్వాత రైతులకు ఏ నష్టం జరిగినా ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత వహించాలని,ప్రభుత్వ అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా కొనుగోలు వేగవంతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్కె అబ్దుల్, అంబటి లక్ష్మణ్, రైతులు ఎనగందుల పోషన్న, కోట రాములు,మెంగం కిష్టయ్య, బాపురావు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి విద్య వారోత్సవాలు ప్రారంభించాం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాగజ్ నగర్ మున్సిపల్ చైర్మన్ షాహీన్ సుల్తానా:

## ప్రతిరోజు ఒక వైవిధ్యమైన కార్యక్రమం చేపడతాం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి:




**మే 11, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియో జకవర్గంలోని సిర్పూర్ కాగజ్నగర్ మండలంలో ఉన్న గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలు భాగంగా సోమవారం విద్య వారోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు.ఈ కార్యక్రమా నికి కాగజ్నగర్ మున్సిపల్ చైర్మన్ సుల్తానా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రిన్సిపాల్ శ్రీదేవి తో కలిసి షాహిద్ సుల్తానా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశానుసారం ఈ వేసవి సెలవుల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఎడ్యుకేషన్ వారోత్సవాలను 11-5-26 నుండి 17-5-26 వరకు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా ప్రతీ రోజూ ఒక వైవిధ్యమైన కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు అనేక విషయాలు తెలుసు కోవడమే కాకుండా వివిధ రకాల ప్రయోజనాలు పొందుతారని తెలిపారు. ప్రభుత్వం యొక్క ఈ ఉద్దేశ్యాన్ని అందరం కష్టపడి సాధించుకో వాలని సూచించారు. కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం దాని ద్వారా విద్యార్థులు అనేక విషయాలు తెలుసుకోవ డమే కాకుండా వివిధ ప్రయోజనాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశానుసారం కలశాలలో ప్రతీ రోజు అనగా ఈ నెల 17 వరకు వివిధ రకాలైన కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో వారం రోజులలో నిర్వహించబడే కార్యక్ర మాల యొక్క బ్రోచర్ ను ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ షాహీన్ సుల్తానా అదేవిధంగా కలశాల ప్రిన్సిపల్ శ్రీదేవి సిబ్బందితో కలిసి ఆవిష్క రించారు. కళాశాల కోఆర్డినేటర్ శ్రీ దుర్గం జనార్దన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శారద, ముంజం రాజేశ్వర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తూదూరు దత్తాత్రేయ టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ నితిక పంత్

**10 ఫిర్యాదులు స్వీకరణ.. సత్వర పరిష్కారానికి ఆదేశాలు**




**ఆసిఫాబాద్, మే 11** ప్రజా జ్యోతి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితిక పంత్ ప్రజల నుంచి 10 ఫిర్యాదులు స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విన్న ఎస్పీ, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సూచనలు చేశారు.ప్రజలు ఎలాంటి భయాలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించు కోవాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు

# వేధింపులు ఎదురైతే 'షీ టీమ్'ను ఆశ్రయించండి



**దండేపల్లి,మే11(ప్రజాజ్యోతి):** మహిళలు వేధింపులకు గురైతే భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని మంచిర్యాల షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి పేర్కొన్నారు. సోమవారం రెబ్బెనపల్లిలో ఉపాధి హామీ కూలీలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈవ్ టీజింగ్, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వేధింపులు ఎదురైతే డయల్ 100 లేదా మంచిర్యాల షీ టీమ్ నంబర్ 87126 59385, రామగుండం వాట్సాప్ నంబర్ 63039 23700కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య**



**మంచిర్యాల, 11, మే (ప్రజా జ్యోతి):** జనగణన--2027లో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమర్థవం తంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. అన్వేష్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఇండ్ల గణన ప్రక్రియను అధికారులు నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించా లని తెలిపారు. ఎన్యుమరే టర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాకుల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొర పాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రజలతో మర్యాదపూర్వ కంగా వ్యవహరిస్తూ ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గృహ జాబితా కార్యక్రమం భవిష్యత్తు ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.టి.సి.పి.ఓ సంపత్, జనగణన అధికారులు హరిప్రసాద్, కృష్ణ, ఎన్యుమరేటర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కుమారుడిపై ఆరోపణలు.. బీజేపీ ఎందుకు మౌనం?

## మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు.. నైతిక బాధ్యత వహించాలి



**ఆసిఫాబాద్ మే 11 ప్రజా జ్యోతి** దేశం, ధర్మం కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే బీజేపీ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై వచ్చిన తీవ్ర ఆరోపణలపై ఎందుకు మౌనం పాటిస్తున్నారని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క నిలదీశారు.సోమవారం ఆసిఫాబాద్ డీసీసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆమె.. బండి సంజయ్ కుమారుడు మైనర్ బాలికను స్నేహం పేరుతో ఫామ్‌హౌస్‌కు రప్పించి, కూల్‌డ్రింక్స్‌లో మత్తు పదార్థాలు కలిపి అత్యాచారానికి పాల్పడ్డారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయన్నారు. హిందూ బాలికకు అన్యాయం జరిగినా బీజేపీ నేతలు స్పందించకపోవడం శోచనీయమన్నారు.'కంచే చేను మేసినట్లు' కేంద్ర మంత్రి కుమారుడే ఇలాంటి ఆరోపణలు ఎదుర్కోవడం బాధాకరమని, ఈ వ్యవహారంలో బండి సంజయ్ నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమాజం పట్ల బాధ్యత ఉంటే వెంటనే ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.బండి సంజయ్‌కు నీతి, నిజాయితీ ఉంటే కేసు విచారణ పూర్తయ్యే వరకు ఎంపీ, మంత్రి పదవులకు రాజీనామా చేసి పారదర్శక విచారణకు సహకరించాలని సూచించారు. దేశం, ధర్మం కోసం రాజకీయాలు చేస్తున్నామని చెప్పే బీజేపీ ఈ ఘటనపై తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్లు తరిఖ్, భీమ్ రావ్, ప్రధాన కార్యదర్శి బుద్దే విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావు, కాంగ్రెస్ నేతలు సుజాయిత్ ఖాన్, షేక్ మహమ్మద్, అదే దిలీప్, మనే సంతోష్ కుమార్, సోనులే రమేష్, బొమ్మకంటి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు హనుమాన్ జయంతి ప్రత్యేక పూజా విధానం

**నేడు (మంగళవారం) ఇలా చేస్తే అన్నీ శుభాలే.....**




**మంచిర్యాల, 11, మే (ప్రజా జ్యోతి):** హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. హిందూ సంప్రదాయంలో ఆంజనేయ స్వామిని భక్తి, బలం, ధైర్యం, నిస్వార్థ సేవకు ప్రతీకగా భావిస్తారు. శ్రీరాముడి పరమ భక్తుడిగా పేరుగాంచిన హనుమంతుడు అంజనాదేవి, కేసరి దంపతులకు జన్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. వాయుదేవుని అనుగ్రహంతో జన్మించినందున ఆయనను 'వాయుపుత్రుడు'గా కూడా భక్తులు పూజిస్తారు. ఆంజనేయస్వామి భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీకగా భావించే ఈ పవిత్ర దినాన పూజలు చేయడం ద్వారా ఇంట్లో సుఖశాంతులు నెలకొంటాయని పండితులు చెబుతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామునే లేచి ఇల్లు, వాకిలిని శుభ్రం చేసుకుని పవిత్రతతో పూజలు ప్రారంభించడం ఎంతో శుభప్రదమని సూచిస్తున్నారు. పండితుల విమల ప్రకారం ఉదయం 9:54 గంటలలోపు హనుమంతుడికి పూజలు నిర్వహిస్తే విశేష ఫలితాలు లభిస్తాయని తెలిపారు. భక్తులు పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహం లేదా ఫోటోను పూలతో అలంకరించి భక్తిశ్రద్ధతో పూజలు చేయాలని సూచిస్తున్నారు. పూజా కార్యక్రమంలో ముఖ్యంగా 'శ్రీరామ రక్షా స్తోత్రం' లేదా 'శ్రీరామ నామస్మరణ' చేయాలి. అనంతరం హనుమాన్ చాలీసా, హనుమాన్ దండకం పారాయణం వల్ల ఆంజనేయస్వామి కృప కలుగుతుందని చెబుతున్నారు. అలాగే తమలపాకులతో ప్రత్యేక పూజ చేసి, నవరధాన్యాలపై దీపం వెలిగించడం ద్వారా కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం వెల్లివిరుస్తాయని విశ్వాసం. హనుమాన్ జయంతి రోజున ఆలయాల్లో తెల్లవారు జామున నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నారు. పంచామృతాభిషేకం, తమలపాకుల అర్చనలు, వడమాల సమర్పణ, బేటాడి ఆకులతో ప్రత్యేక అలంకరణలు చేయనున్నారు. అనేక ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం, సుందరకాండ పఠనం, భజన కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో భక్తులు ఉదయం నుంచే ఆంజనేయస్వామి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక దర్శనాలు చేసుకుంటు న్నారు. కొందరు భక్తులు ఉపవాస దీక్షలు పాటిస్తూ స్వామివారికి బెల్లం, వడలు, వెన్న నైవేద్యంగా సమర్పిస్తారు. హనుమంతుడిని ఆరాధించడం ద్వారా శని దోషాలు తొగి, ధైర్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తుల పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో దేవాలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లాలోని పలు ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసి అవకాసం ఉందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూ లైన్స్, తాగునీటి సౌకర్యం, ప్రసాదాల పంపిణీ ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తే ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, విజయాలు కలుగుతాయని పండితులు తెలిపారు.

## ప్రభుత్వాసుపత్రిలో డైట్ గోల్‌మాల్

**అన్నం, పప్పుతోనే సరిపెడుతున్న కాంట్రాక్టర్.. టీపీసీ నేతల తనిఖీ**



**ఆసిఫాబాద్, మే 11 ప్రజా జ్యోతి** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో డైట్ చార్ట్ ప్రకారం రోగులకు ఆహారం అందించడం లేదని సమాచారం అందుకున్న టీపీసీ రాష్ట్ర సభ్యుడు విశాల్ కాంద్రే, ప్రెసిడెంట్ భువనగిరి సతీష్ బాబు సోమవారం ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. అనారోగ్యంతో అడ్మిట్ అయిన రోగులకు రోజూ నాణ్యమైన భోజనం, పాలు, కోడిగుడ్లు అందించాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు అధిక లాభాల కోసం కేవలం అన్నం, పప్పుతోనే సరిపెడుతున్నారని వారు ఆరోపించారు. పాలు, కోడిగుడ్లు రావడం లేదని సిబ్బంది చెప్పినట్లు తెలిపారు. మహిళా సెక్షన్‌లో ఇంజక్షన్ ఇవ్వడానికి కనీసం కర్టెన్లు లేకపోవడం సిగ్గుచేటని, ఎమర్జెన్సీ సమయంలో లిఫ్ట్ కూడా పనిచేయడం లేదని మండిపడ్డారు. వెంటనే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని రీ-టెండర్ పిలవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంతో ప్రాణ నష్టం జరిగితే సూపరింటెండెంట్‌పై మర్డర్ కేసు పెట్టాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాపర్తి నవీన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఏఐయుకేఎస్ జాతీయ ప్రథమ మహాసభ ఇల్లందు కు తరలి వెళ్ళిన నిర్మల్ జిల్లా ప్రతినిధులు



**ఖానాపూర్ మే 11 (ప్రజా జ్యోతి )** ఈనెల మే 11,12,13 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు పట్టణంలో జరిగే అఖిల భారత ఐక్య రైతు సంఘం ( ఏఐయుకేఎస్ ) జాతీయ ప్రథమ మహాసభలకు నిర్మల్ జిల్లా నుంచి సోమవారం ప్రతినిధులు తరలి వెళ్లారు ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు నంది రామయ్య మాట్లాడుతూ.. భారత దేశంలోని 16 రాష్ట్రాల రైతు సంఘాలు ఐక్యమై అఖిలభారత ఐక్య రైతు సంఘం ( ఏఐయుకేఎస్ ) అనే ఒకే సంఘంగా ఏర్పడి ప్రథమ జాతీయ మహాసభలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు పట్టణంలో మూడు రోజుల పాటు జరుగుతుందని అన్నారు ఈ మహాసభలకు 16 రాష్ట్రాలకు చెందిన ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ జాతీయ మహాసభలలో దేశంలోని రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని గురించి చర్చిస్తారని తెలియజేశారు.ప్రభుత్వాలు మారినా రైతుల భవిష్యత్తు మారడం లేదని, కేంద్రంలో కావచ్చు రాష్ట్రంలో కావచ్చు ఏ ప్రభుత్వమైనా పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్నాయి గాని రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో రైతుల రుమాఫీలు చేయకపోవడం, రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడం, ధాన్యం కొనుగోలులో జాప్యం చేయడం లాంటివి గమనిస్తే రైతాంగానిపై ప్రభుత్వాల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు.ఈ మహాసభకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రసంగిస్తారని అన్నారు.ఈ మహాసభలకు బయలుదేరిన వారిలో జిల్లా కార్యదర్శి వి.మహేందర్, నాయకులు గోరె భాయ్, మనోహర్, పూసం లక్ష్మణ్, సోనేరావ్, బీర్ సావ్, గుమ్మడి వెంకన్న లు ఉన్నారు

# సింగరేణి కార్మికులకు శుభవార్త

**సింగరేణి మెడికల్ బోర్డు పునరుద్ధరణ.......... !!**

**ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్**

**జెట్టి శంకర్ రావు, ఐఎన్టియుసి కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు**

**మంచిర్యాల ,11,మే (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికులకు నిజంగా ఇది శుభవార్త ......... సింగరేణి మెడికల్ బోర్డు పునరుద్ధరణ జరిగిందని ఐఎన్టియుసి కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు సోమవారం తెలిపారు .సింగరేణి కార్మికుల్లో ఇటీవల నెలకొన్న అనిశ్చితి పరిస్థితులపై ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ నాయకత్వంలో ఐఎన్టియుసి ముఖ్య నేతల బృం దం గత వారం హైదరాబాద్‌లో పలువురు మంత్రులు, ఉన్నతాధి కారులతో విస్తృత స్థాయి చర్చలు జరిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వెం నరేందర్ రెడ్డి లను కలిసి సింగరేణి కార్మికుల సమస్యలను వివరించారు. అనంతరం సింగరేణి సీఎండీ బుద్ద ప్రకాష్ జ్యోతి డైరెక్టర్ (ఫా ) గౌతమ్ పోట్రు లతో కూడా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చలు జరిపారని తెలిపారు. చర్చల్లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చిన అంశాలను వివరించారు. గతంలో మాదిరిగానే మెడికల్ బోర్డు నిర్వహణ కొనసాగించడం, గతంలో జరిగిన రెండు మెడికల్ బోర్డులపై రివ్యూ నిర్వహించడం, కార్మికుల పెర్క్స్ పై విధిస్తున్న ఇన్‌కమ్ ట్యాక్స్‌ను రద్దు చేయడం, సొంత ఇంటి పథకం అమలు, ట్రైనింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ, మారుపేర్ల మార్పు, డిస్మిస్ అయిన కార్మికుల సమస్యల పరిష్కారం, నూతన బొగ్గు గనుల ప్రారంభం, విజిలెన్స్ కేసుల పరిష్కారం, పెండింగ్ బకాయిల చెల్లింపు లని



వివరించారు .ఈ అంశాలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు డా. బి. జనక్ ప్రసాద్ కూడా తెలిపారు. ముఖ్యంగా మెడికల్ బోర్డు పునరుద్ధరణకు మరియు గత రెండు బోర్డులపై రివ్యూ నిర్వహించేందుకు యాజమాన్యం హామీ ఇచ్చిందని వెల్లడించారు. అదేవిధంగా కార్మికుల పెర్క్స్ పై ఇన్‌కమ్ ట్యాక్స్ మాఫీ విషయాన్ని కూడా సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సొంత ఇంటి పథకం అమలుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ప్రభుత్వంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చినట్లు వివరించారు. ఈ సమావేశాల్లో ఐఎన్టియుసి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, త్యాగరాజన్, జెట్టి శంకర్ రావు, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్, వైస్ ప్రెసిడెంట్లు దాస్ కోట రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలలుగా సరఫరా చెయ్యని మిషన్ భగీరథ నీళ్లు

సిబ్బంది నిర్లక్ష్యం మా? అధికారుల పర్యవేక్షణ లోపం?

త్రాగు నీటి కోసం బెజ్జూర్ గ్రామపంచాయతీ ఎదుట మహిళలు ఖాళీ బిందెల తో నిరసన ధర్నా, ఆందోళన:బిబి

మహిళల మద్దతు పలికిన త్రాగునీటి సమస్య పరిష్క రించాలని డిమాండ్ చేసిన సమాచార హక్కు రక్షణ చట్టంబి 2005, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి లింగయ్య:

**మే 11, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియో జకవర్గంలోని బెజ్జూర్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట కాలి బిందెలతో మహిళలు వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా అధికారులు మిషన్ భగీరథ నీళ్ళ సరఫరా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యమా? అధికారుల పర్యవేక్షణ లోపమా? అంతు చిక్కని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు చేస్తున్న నిరసన ధర్నాకు సమాచార హక్కు రక్షణ చట్టంబి2005, సిర్పూర్ టి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి లింగయ్య వారికి మద్దతు తెలిపి మహిళలతో కలిసి మాట్లాడుతూ.. బెజ్జూర్ మండల కేంద్రంలోని1వ వార్డుకు గత మూడు నెలలుగా మిషన్ భగీరథ నీళ్ల రావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు లేకపోవడం వల్ల సరఫరా గత 3నెలల మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. ఈ విషయంపై పలుమార్లు మండల అధికారులకు,






మండల అధికారులకు మిషన్ భగీరది అధికారు లకు సింబ్బందికి చెప్పిన పట్టించుకోవడం లేదని ఎండ తీవ్రత దృశ్యనీళ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నిద్రమత్తులో ఉన్న సిబ్బంది, అధికారులు. స్పందించి వెంటనే నీళ్లు సరఫరా చేయాలని, కోరారు. జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి బెజ్జూర్ మండలంలో గత మూడు నెలలుగా సరఫరా కాని మిషన్ భగీరథ నీళ్లను అందించాలని కోరారు. మిషన్ భగీరథ నీళు ల్ల అందించే వరకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి నీళ్లు అందించాలని డిమాండ్ చేస్తున్న సందర్భంలో స్పందించిన గ్రామపంచాయతీ కార్య దర్శి వైకుంఠం చరవాణి ద్వారా మాట్లాడుతూ..ప్రతి రోజు ఒక టాంకర్ వాటర్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలు నిరసన కార్యక్రమాన్ని విరమింపజేసి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు వాసులు మహిళలు పాల్గొన్నారు.

## ఈజీఎస్ పనులను పరిశీలించిన సర్పంచ్ బృందం

**ఉపాధి హామీ పనుల వద్ద మౌలిక వసతులపై ఆరా**



**ఆసిఫాబాద్ మే 11 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం పరిధిలోని లంజనివీర గ్రామం లో సోమవారం నిర్వహిస్తున్న ఉపాధి హామీ (ఈజీఎస్) పనులను గ్రామ సర్పంచ్ పవన్, ఉప సర్పంచ్ విట్టల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ పరిశీలించారు. పనుల స్థలానికి చేరుకున్న నాయకులు అక్కడ పనిచేస్తున్న మేటీలు, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనుల నిర్వహణ తీరు, వేతనాల చెల్లింపులు, తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఎండాకాలంలో కూలీలు ఇబ్బందులు పడకుండా అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పవన్ హామీ ఇచ్చారు. కూలీలకు సమయానికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పనులు గ్రామ అభివృద్ధికి ఉపయోగపడేలా నిర్వహించాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జనాభా గణన కోసం వచ్చే ఉపాధ్యాయ సిబ్బందికి సహక రించాలి

**సిర్పూర్ (టి) తాసిహల్దార్ మండల ఇన్చార్జి అధికారి రహీముద్దీన్**



**మే 11, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండ లంలో చేపట్టే జనాభా గణన కోసం ఇళ్లకు వచ్చే ఉపాధ్యాయులకు సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని సిర్పూర్(టి) తహసీల్దార్, మండల ఛార్జ్ ఆఫీసర్ రహీముద్దీన్ కోరారు. సోమవారం నుండి గణన ప్రారంభం కానున్న నేప థ్యంలో తహసిల్దార్ రహీముద్దీన్ సిర్పూర్(టి) మండల కేంద్రంలోని అరబ్ మొహల్లాలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బందికి సరైన వివరాలు చెప్పాలని ఆ సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుంద న్నారు వివరాలు ఇవ్వడం వల్ల ఎలాంటి సంక్షేమ పథకాలు రద్దు కావని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అందుబాటులో ఉండి ఎన్యుమరేటర్లకు సహకరించాలన్నారు. జనాభా గణాంకాల ఆధారంగానే విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీఎస్వో జయభాస్కర్, టెక్నికల్ అసిస్టెంట్ మనీషా, మాస్టర్ ట్రైనర్ జావిద్ అహ్మద్, ఎన్యుమరేటర్ మజర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# రామారావుపేటలో కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటన

**రైతుల సమస్యలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి**
**వరి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశాలు**



**జైపూర్ మే 11 ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని రామారావు పేట గ్రామంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటించి రైతులు ఎదుర్కొంటున్న వరి ధాన్యం కొనుగోలు సమస్యలను పరిశీలించారు.కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సకాలంలో కొనుగోలు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామం లోని చెరువు మత్తడి సమస్యను కూడా పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు తెలిపారు.కలెక్టర్ స్పందనపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**విద్యా వారోత్సవాల్లో అధికారులు భాగస్వాములు కావాలి**
**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 11 ,( ప్రజాజ్యోతి ).**ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందే వినతులను ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్నారని, వారి వినతులపై అధికారులు సానుకూల దృక్పథంతో స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉంటేనే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజావాణిలో భాగంగా ప్రజలు ప్రధానంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సమర్పించారు. అధికారులు, సిబ్బంది విధిగా కార్యాలయ సమయాలను పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. 'ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లావ్యాప్తంగా విద్యా వారోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు చురుకుగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ నెల 15న నిర్వహించనున్న 'లైబ్రరీ డే' సందర్భంగా అధికారులు పెద్ద ఎత్తున పుస్తకాలను వితరణ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హెల్మెట్ లేని కారణంగా అసభ్య పదజాలంతో దూషించిన గోదావరిఖని వన్టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి అనుచిత వ్యాఖ్యలకు మనస్థాపానికి గురై

**గోదావరిఖని చౌరస్తా, అమరవీరుల స్తూపం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొని:**
**ఆత్మహత్యా యత్నం చేసుకున్న తెలంగాణ ఉద్యమకారి తోడేటి శంకర్ గౌడ్:**
**బాధ్యత గల పదవిలో ఉన్న సర్కిల్ ఇన్స్పెక్టర్ అనుచిత వ్యాఖ్యలు బాధాకరం:**
**ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీఐపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి:**
**ఉద్యమకారుల వేదిక తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుల్గం నారాయణ,సిర్పూర్ (టి) నియోజకవర్గ ఇన్చార్జి సింగం నాగేష్:**





**మే 11, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నియోజకవర్గంలోని దహేగాం కు చెందిన తెలంగాణ ఉద్య మకారులు, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్రఉపాధ్యక్షులు పుల్గం నారాయణ,సిర్పూర్(టి) నియోజకవర్గ ఇన్చార్జి సింగం నాగేష్ పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారు లు తోడేటి శంకర్ గౌడ్ అత్యవసర ప్రయాణం చేస్తున్న అట్టి సందర్భంలో హెల్మెట్ లేని కారణంగా వారిని గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి అడ్డుకొని నాన్న బూతులు తిట్టి అనుచిత వ్యాఖ్యలు చేసి అవమాన పరిచి అసభ్య పదజాలంతో దూషించడంతో మన స్థాపంచెంది గోదావరిఖని చౌరస్తా అమరవీరుల స్థూపం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మ హత్యాయత్నం చేసు కోవడం బాధాకరమని అన్నారు. బాధ్యత గల పదవిలో ఉన్న సర్కిల్ ఇన్స్పెక్టర్ అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీఐ ఇంద్రసేనారెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల తెలంగాణ ఉద్యమకారుల వేదిక పక్షాన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రం కోసం పదుల సంఖ్యలో కేసులు ఎదుర్కొని అనేక కష్ట నష్టాలకోర్చి తెలంగాణ రాష్ట్ర సాధనలో గోదావరి ఖని ప్రాంతంలో ఉద్యమ బిడ్డగా తోడేటి శంకర్ గౌడ్ పేరు గాంచిన బిడ్డగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుపరిచితుడై నటువంటి ఉద్యమకారు లు తోడేటి శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసుకోవడం యావత్ తెలంగాణ ఉద్యమ సమాజానికి దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. తోడేటి శంకర్ గౌడ్ తప్పు చేసి ఉంటే చట్టపరమై చర్యలు తీసుకోవాలి తప్ప ఒక తెలంగాణ ఉద్యమ కారుడిని ఒక బాధ్యత గల పౌరుడిని అని చెప్పినా వినకుండా ఇష్టా రీతిన తిట్టడం వల్ల ఆయన ఆత్మహత్య యత్నం చేసుకోవడం జరగరానిది జరుగుతే దానికి బాధ్యు లు ఎవరని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ యొక్క సంఘటనను తెలంగాణ ఉద్యమకారుల వేదిక పక్షాన ఖండిస్తున్నా మని అన్నారు.ఇప్పటి కైనా సిఐ, ఇంద్రసేనారెడ్డి పై చట్టపరమైనటువంటి చర్యలు తీసుకోని సస్పెం డ్ చేయాలని ఉన్నతాధి కారులను కోరారు. లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారుల వేదిక పక్షానఆందోళనలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు.

# ఖానాపూర్ డబల్ బెడ్ రూమ్ల పై విచారణ పూర్తి చేసి అనర్హులను తొలగించాలి

## ప్రజా ఫిర్యాదుల్లో జిల్లా కలెక్టర్ కువినతి--న్యూ డెమోక్రసీపార్టీ



**ఖానాపూర్ మే 11( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణంలోని కొమురం భీమ్ చౌరస్తాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ల లో నివాసం ఉంటున్న లబ్ధిదారులపై పూర్తి విచారణ త్వరగా పూర్తి చేసి అనరులను తొలగించి అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని లిసిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ, డబుల్ బెడ్ రూమ్ సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ,ప్రజా ఫిర్యాదుల్లో (గ్రీవెన్స్ లో) రాతపూర్వకంగా సోమవారం వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ మాట్లాడుతూ పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లలో గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, అధికారులు అక్రమాల అవినీతి వల్ల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొంతవరకు డ్రా చేసి మిగిలిన బెడ్ రూములను పేదలకు చెందకుండా బడా బాబులకు కేటాయించారు. వీటిపై సమగ్రంగా విచారణ జరిపించాలని విచారణ పూర్తి స్థాయిలో త్వరగా పూర్తి చేయాలని, సెల్ఫ్ అఫిడవిట్ తీసుకొని అనర్హులను తొలగించి, అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదల కోసం కేటాయించిన ఇండ్లను వారికి దక్కకుండా అవినీతికి పాల్పడి ఉన్నత వర్గాలకే కేటాయించారని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వాధికార యంత్రాంగం ప్రభుత్వం గతంలో జరిగిన తప్పులను సరిచేసి న్యాయంగా పేదలకు చెందాల్సిన డబల్ బెడ్ రూములు వారికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు . లేని పక్షంలో పార్టీ తరపున డబుల్ బెడ్ రూమ్ సాధన సమితి తరపున ఆందోళన ఉధృతం చేస్తామని లిఖితపూర్వక ఫిర్యాదులు కలెక్టర్కు ఉన్నతాధికారులకు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, డబల్ బెడ్ రూమ్ సాధన కమిటీ కన్వీనర్ తోట రాధా, లక్ష్మి, కల్పన, కమల, మధు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ఇంటి పెళ్లికి గ్రామస్తుల అండ



నేరడిగొండ మే 11 (ప్రజాజ్యోతి ):మండలంలోని రోల్‌మామడ గ్రామస్తులు తమ ఉదారతను చాటుకొని ఒక పేద కుటుంబానికి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన అత్రం రాధాబాయి -- రాములు దంపతుల కుమారుడు సోనేరావు వివాహ నిశ్చయమవగా, పేదరికం కారణంగా పెళ్లి ఖర్చులకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించారు.దీంతో గ్రామంలోని ప్రతి ఒక్కరూ స్పందించి, చందాలు సేకరించి రూ. 20 వేల నగదును ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తోడ్సం శంకర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సాయం చేయడంలో తమ గ్రామం ఎప్పుడూ ముందుంటుందని, ఈ ఐక్యతే తమ గ్రామానికి బలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ కుటుంబాన్ని ఆశీర్వదించారు.

## ధాన్యం తరలింపులో జాప్యం వద్దు

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 11 ,( ప్రజాజ్యోతి ). కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ, రవాణాపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువకాలం నిల్వ ఉంచరాదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ధాన్యం రాక మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అదనపు లారీలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.అవసరానికి తగ్గట్టుగా రవాణా వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు సరిపడా హమాలీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఎంత ధాన్యం తరలించారనే వివరాలను ఎప్పటికప్పుడు నివేదించాలని ఆదేశించారు.ఇప్పటివరకు జరిగిన ధాన్యం తరలింపు ప్రక్రియ, కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న నిల్వల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, లారీ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన



నేరడిగొండ, మే 11 ప్రజా జ్యోతి : మండలంలోని కుప్టి (కె) గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన నూతన వంట గదులను సోమవారం ఘనంగా ప్రారంభించారు. సుమారు రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ వంట గదులను గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడేపు రవి, పిఎసిఎస్ చైర్మన్ మందుల రమేష్ కలిసి ప్రారంభించారు.అనంతరం, కుమారి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ( జెడ్ పి హెచ్ ఎస్ ) ఆవరణలో రూ. 10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన ప్రహరీ గోడకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, వార్డు సభ్యులు వొర్స సాయికిరణ్,గ్రామస్తులు శ్రీ రామోజీ నారాయణ, అలీ సబ్,పాఠశాల ఉపాధ్యాయులు గంగా సింగ్, వెంకటరమణ మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ కార్యకర్తల సమావేశం దరఖాస్తులు స్వీకరన,

### సమానత్వం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం వెద్మ బొజ్జు పటేల్ వెల్లడి



ఖానాపూర్ మే 11( ప్రజా జ్యోతి ) బండి రంగాల్లో సమానత్వం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెద్మ బొజ్జు పటేల్ అన్నారు జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్సీ విభాగం కార్యకర్తల సమావేశం సోమవారం మారుతి ఇన్ కాన్ఫరెన్స్ హాల్ నిర్మల్ లో జరిగింది.కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా పదవుల కొరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా ఇంచార్జి సమత సుదర్శన్ తో కలిసి పాల్గొన్న నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడు తూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వారికి పదవులు వస్తాయన్నారు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే,రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో జిల్లాలో అన్ని అనుబంధ విభాగాలను పూర్తి స్థాయిలో పదవులు భర్తీ చేస్తున్నాం అని, నాయకుల పని తీరు ద్వారానే వారి స్థాయికి దగ్గ పదవి పార్టీ అనుబంధ విభాగాల్లో రాష్ట్ర నాయ కత్వం కేటాయిస్తుంది అన్నారు.దేశంలోనే కాంగ్రెస్ పార్టీ లో ఉన్నంత స్వేచ్ఛ మరే పార్టీలో ఉండదని.ఎలాంటి తేడాలు లేకుండా పార్టీలో ,ప్రభుత్వంలో కష్టపడ్డ నాయకులకు కార్యకర్తలకు సమానంగా పదవులు దక్కుతాయి అన్నారు. బిఎల్ఎలను పార దర్శకంగా పార్టీ కోసం శ్రమించే వారిని యువతకు ప్రాధాన్యత ఇస్తూ ఎన్నుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు,ఎస్సీ డిపార్ట్మెంట్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ మార్కెట్ చైర్మెన్ కూతురి వివాహానికి హాజరైన, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమబొజ్జు పటేల్



ఖానాపూర్ మే 11 (ప్రజా జ్యోతి )ఖానాపూర్ మార్కెట్కమిటీ చైర్మెన్ పడిగేల భూషణ్ కూతురి వివాహం కడెం మండలంలోని కొండకూరు ఎస్ కె ఫంక్షన్ హాల్ లో సోమవారం జరిగింది ఈ కార్యక్రమానికి హాజరైన నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ నూతన వధూవరులు సౌమ్య - రాకేష్‌ని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కడెం మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన సంస్థ పంపిణీ చేసే సీడ్స్ రైతులు వినియోగించేలా ప్రోత్సహించాలి

### రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 11 ,( ప్రజాజ్యోతి ).రాష్ట్ర విత్తన సంస్థ పంపిణీ చేసే సీడ్స్ రైతులు వినియోగించేలా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మెన్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి, వారి ఉన్నతికి విత్తన సంస్థ పనిచేస్తుందని, డీలర్లు అందరూ ప్రభుత్వం తయారు చేసే విత్తనాలు రైతులు సాగు చేసుకునేలాగా ప్రచారం కల్పించాలన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ పంపిణీ చేసే విత్తనాలు అన్ని నాణ్యతా పరంగా ఉత్తమమైనవి అని అన్నారు. ధర తక్కువ ఉండటంతో పాటుగా, దిగుబడి కూడా అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అనుమతులు లేని ప్రైవేట్ విత్తనాల కంపెనీలు రైతులను ప్రలోభాలకు గురిచేస్తూ, నాసిరకం విత్తనాలు అమ్ముతున్నాయని వివరించారు. దీని ద్వారా రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. డీలర్లు ఎట్టిపరిస్థితుల్లో నకిలీ విత్తనాలు విత్తనాలు రైతులకు అమ్మరాదని హెచ్చరించారు. సహకార సంఘాలు, మహిళా సంఘాలు విత్తన సంస్థ యొక్క విత్తనాలు రైతులకు అందించాలని తెలిపారు.

### విత్తనాభివృద్ధి సంస్థ సీడ్స్ వల్ల రైతులకు లాభాలు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసే విత్తనాలు వల్ల రైతులకు చాలా లాభాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సంస్థ తయారు చేసే విత్తనాలు అన్ని ఎన్నో నాణ్యతా పరీక్షల తర్వాత విపణిలోకి వస్తాయన్నారు. ఈ విత్తనాలు సాగు చేయడం ద్వారా రైతులు ఎక్కువ లాభాలు పొందగలుగుతారని చెప్పారు. అలాగే నకిలీ విత్తనాల నుంచి కూడా రైతులు నష్టపోకుండా ఉంటారని అన్నారు. విత్తన డీలర్లు అందరూ రైతులు ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు వినియోగించేలా ప్రోత్సహించాలని తెలిపారు.ఈ సమావేశంలో నిర్మల్, ఆదిలాబాద్ వ్యవసాయ శాఖ అధికారులు అంజి ప్రసాద్, శ్రీధర్, డిఆర్డిఓ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు భీమ్ రెడ్డి, అబ్దుల్ హాది, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, ఇతర అధికారులు, విత్తన డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ లో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రమాదాల పరేషాన్లో పట్టణ ప్రజలు

**ఖానాపూర్ మే 11( ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోయి పట్టణ ప్రజలకు ప్రమాదాల అంచులో పరేషాన్ లతో సతమతమవుతున్నారు ఇది ఏమి పట్టనట్టు ఖానాపూర్ మండల స్థాయి రెవెన్యూ, మండల ప్రజా పరిషత్, పంచాయతీ రాజ్,ఆర్ అండ్ బి,పట్టణ మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఖానాపూర్ పట్టణంలోని ముఖ్య రహదారి ఎన్టీఆర్ విద్యానగర్ నుండి ఇరుపక్కల చిరు వ్యాపారులు పండ్ల వ్యాపారం తో పాటు పలు పానీయాలు కాలేజీ పరిసర ప్రాంతాల్లో ఐచర్ లాంటి పెద్ద పెద్ద వాహనాల పార్కింగ్ అక్కడ పండ్ల పండ్లు ఇతర వ్యాపారుల బండ్లు వెలిశాయి తెలంగాణ చౌక్ నుండి మూతపడ్డ లక్ష్మీ థియేటర్ ప్రాంతం వరకు, తెలంగాణ చౌక్ నుండి పోలీస్ స్టేషన్ వరకు ఇరుపక్కల తోపుడు బండ్లు కూరగాయల మార్కెట్లు తాత్కాలిక తినుబండారాల బండ్లు చేరడం వల్ల పక్కనే గల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఎమర్జెన్సీ వ్యాధిగ్రస్తులకు తీవ్ర అంతరాయంతోపాటు 108 వాహనాలు రాకపోకలు ఇబ్బందులు కలుగుతున్నాయి అలాగే స్థానిక తహసిల్దార్ రెవెన్యూ కార్యాలయం ముందు మూతపడ్డ టెలలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు అలాగే స్థానిక అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలోనూ అడ్డు అదుపు లేకుండా అక్రమన అక్కడి నుండి ఎడమవైపు నుండి బస్టాండ్ కు చొరబాటులో పార్టీ బస్సులు చేరడానికి తీవ్ర అంతరాయం కలిగి పలుమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి బస్టాండ్ వెళ్లే ప్రాంతంలో సైతం అక్రమంగా తాత్కాలిక పండ్ల ఇతరత్రా దుకాణాల బండ్లు ఉన్న పోలీసులు మున్సిపల్ పాలకులు పట్టించుకోవడంలేదని తీవ్రంగా విమర్శిస్తున్నారు మెట్పల్లి మీదుగా వచ్చే బస్సులు బస్టాండ్ ప్రాంగణానికి చేరు బాటలో మలుపులో ఆటోలు టెంపరరీ వ్యాపారపు దుకాణాలు ఉండడంతో బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగి ప్రమాదాలు



జరుగుతున్నాయి తెలంగాణ చౌక్ నుండి ఆటో అడ్డనుండి డి ఎస్ స్పోర్ట్ మీదుగా పల్లె ప్రాంతాలకు వెళ్లే ఆటోలకు ఆర్టీసీ బస్సులకు సైతం తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి ఇంత జరుగుతున్న స్థానిక ప్రజా ప్రతినిధులు కానీ వివిధ పార్టీలకు చెందిన నాయకులు కానీ పట్టించుకున్న పాపాన పోలేరని ప్రజలు ఘాటుగా విమర్శిస్తున్నారు గత ఐదు సంవత్సరాలుగా రోడ్డు వెడల్పు పనులు నత్తనడకన చేస్తున్నారు తప్ప పూర్తిస్థాయిలో పారదర్శకంగా జరగడం లేదు మేజర్ పంచాయతీ గా ఉన్న ఖానాపూర్ ను మున్సిపాలిటీగా చేసి ఖానాపూర్ పట్టణ ప్రజల మానప్రాణాలను, వ్యాపారపు వసూలలో ఇంటి పన్నుల్లో దోచుకుంటున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు అభివృద్ధికి ఆస్కారం లేకుండా మున్సిపాలిటీ చేసి మునిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా మారిందని ఇప్పటికైనా ఖానాపూర్ పట్టణ ట్రాఫిక్ ను నియంత్రించి ప్రమాదాల నివారణతో పాటు పట్టణ ప్రజలకు ప్రశాంతత నెలకొల్పాలని స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రతిపక్షా నాయకులు,స్థానిక శాసనసభ్యులు బొజ్జు పటేల్లు జిల్లా కలెక్టర్ లు చొరవ తీసుకోవాలని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు ఖానాపూర్ పట్టణంలో వారం రెండు రోజులు బుధ ఆదివారాలు జరిగే సంతల్లో నిష్ట రీతిన వ్యాపారుల రోడ్డు పొడవునా ఆటంకాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి వెంటనే మున్సిపల్ శాఖ అధికారులు పట్టించుకోని చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు

# బాసర ఆర్జీయూకేటీలో డిజిటల్ ఆధునిక తరగతి గదులు ప్రారంభం

**బాసర మే 11 ( ప్రజా జ్యోతి)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'విద్యా వారోత్సవాల'ను పురస్కరించుకొని, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) - బాసరలో విద్యారంగ అభివృద్ధికి సరికొత్త బాటలు వేశారు. విశ్వవిద్యాలయంలో అత్యంత ఆధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ ఐసీటీ తరగతి గదులను సోమవారం ఘనంగా ప్రారంభించారు.

**వైభవంగా ప్రారంభోత్సవం**

విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ అధికారికంగా ఈ నూతన డిజిటల్ గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని, నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ఈ సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**డిజిటల్ తరగతుల ప్రత్యేకతలు:**

హైటెక్ హంగులు: ఈ తరగతి గదుల్లో స్మార్ట్ బోధనా వనరులు, హై-క్వాలిటీ ఆడియో-విజువల్ సిస్టమ్స్, సమగ్ర డిజిటల్ మౌలిక వసతులు కల్పించారు. విస్తృత సామర్థ్యం: ఒకే సమయంలో సుమారు 300 మంది విద్యార్థులు ప్రత్యక్షంగా (లైవ్) తరగతుల్లో పాల్గొనేలా వీటిని తీర్చిదిద్దారు.సాంకేతిక సాధికారత: విద్యార్థుల



ను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేసేందుకు, డిజిటల్ పరివర్తనలో భాగంగా ఈ వేదికలు ఎంతో దోహదపడతాయని వీసి పేర్కొన్నారు.సిబ్బందితో ప్రత్యేక సమావేశం కార్యక్రమంలో భాగంగా బోధన, బోధనేతర సిబ్బందితో వీసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విశ్వవిద్యాలయ సర్వతోముఖాభివృద్ధి, సాంకేతిక ఆధారిత విద్యా విధానాల అమలు, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు తీసుకురావడానికి ఆర్జీయూకేటీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెండి బంగారు వర్తక సంఘం అధ్యక్షులుగా బొల్లు దేవిదాస్





**అదిలాబాద్ టౌన్, మే 11 ( ప్రజా జ్యోతి )**అదిలాబాద్ లో వెండి బంగారు వర్తక సంఘం ఎన్నికలు ఆదివారం స్థానిక గుజరాత్ సమాజ్ సంఘభవ నంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆ సంఘం అధ్యక్షుడిగా బొల్లు దేవిదాస్, ప్రధాన కార్యదర్శిగా కట్ట రాజు భారీ మెజారిటీ తో గెలుపొందారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన బొల్లు దేవిదాస్ మాట్లాడుతూ వారి ప్యానెల్ గెలుపుకు సహకరించిన గోల్డ్ సిల్వర్ మర్చెంట్ ప్రతినిదు లందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. వెండి బంగారు వర్తక సంఘం అభివృద్ధి సంక్షేమనికి కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి ఓటువేసి గెలిపించి నందుకు నమ్మకంతో పని చేస్తానని తెలిపారు. అనంతరం కొత్తగా ఎన్నికైన అధ్యక్ష, కార్యద ర్శులకు సంఘం తరపున సభ్యులు కోటోజు భాస్కరచారి కె. మిలింద్ కుమార్, బ్రహ్మం పురుషోత్తం రవి, సంతోష్, పాపన్న తదితరులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆటో కార్మికుల గోస తీరాలంటే కేసీఆర్ రావాల్సిందే



**నేరడిగొండ మే 11 (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలోని ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలన్నా, వారి బతుకులు మళ్ళీ బాగుపడాలన్నా కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం తిరిగి రావాలనే దృఢ సంకల్పంతో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఒక సామాన్య ఆటో కార్మికుడు చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతంగా ముగిసింది.ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుప్టి గ్రామానికి చెందిన ఓరగంటి సాయిరాం అనే ఆటో కార్మికుడు, రాష్ట్రంలోని సుమారు 7.50 లక్షల మంది ఆటో కార్మికుల ఆవేదనను ప్రభుత్వానికి చాటిచెప్పేందుకు ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వరకు సైకిల్ యాత్ర నిర్వహించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌కు చేరుకోగా, భవన్ ఇంచార్జ్ రావుల చంద్రశేఖర్ రెడ్డి మరియు బిఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు వేముల మారన్న సాదరంగా స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సాయిరాం తన ఆవేదనను వ్యక్తం చేస్తూ "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆటో కార్మికుల బతుకులు అగమ్యగోచరంగా మారాయి. పెళ్ళాం పిల్లలకు ఒకపూట అన్నం పెట్టలేని గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. సొంత అన్నదమ్ములే పట్టించుకోని ఈ రోజుల్లో, కార్మికుల కష్టాలు తీరాలంటే మళ్ళీ కేసీఆర్ గారే ముఖ్యమంత్రి కావాలి. అందుకే నా ఆటోను అమ్ముకుని మరీ ఈ సైకిల్ యాత్ర చేపట్టాను.ఒక సామాన్య కార్మికుడు తన వర్గం కోసం చేసిన ఈ పోరాటాన్ని బీఆర్ఎస్ నాయకులు కొనియాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# నేడు పెద్ద హనుమాన్ జయంతి




సంకట మోచన పంచముఖ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో యజ్ఞ హోమాదులు, అన్న దానం ఖానాపూర్ మే 11( ప్రజా జ్యోతి ) గత ఆరు మాసాల క్రితం భక్తాదులచే ప్రతిష్టించబడ్డ నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని కొమరం భీమ్ చౌరస్తాలో గల సంకటయోచన పంచముఖ హనుమాన్ ఆలయంలో మంగళవారం పెద్ద హనుమాన్ జయంతి ఘనంగా ఆలయ కమిటీ నిర్వహించనుంది ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో పచ్చని పందిర్లు వేసి జప హోమాదుల సౌకర్యార్థం సౌకర్యాలు మెరుగుపరుస్తున్నారు జయంతి సందర్భంగా ఆలయ అర్చకులు మంగళవారం ఉదయం పంచముఖ హనుమాన్ ప్రత్యేక పూజలతో పాటు పంచామృత అభిషేకాలు ప్రత్యేక అలంకరణతో దర్శనము తోపాటు తీర్థ ప్రసాదాలు అర్చకులు నందకిషోర్ ఆచార్యులు వితరణ చేయనున్నారు పలు జంటలతో యజ్ఞ హోమాలు మహా అన్నదా నం పంచముఖ హనుమాన్ జయంతి సందర్భంగా పలుజంటలు (దంపతులు) వేద పండితులు నిమ్మగడ్డ సందీప్ శర్మ నిర్వహించనున్న నవగ్రహా, గణపతి మన్యు, మృత్యుంజయ, హనుమాన్ యజ్ఞ హోమాదులలో పాల్గొననున్నారు ఈ సందర్భంగా మహనదాన కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించగా వేలాదిమంది భక్తులు పాల్గొని పునీతులు కాను న్నారు ఆలయ కమిటీ అధ్యక్షులు హిందూ ఉత్సవ సమితి వ్యవస్థాపకులు అల్లాడి వెంకటేశ్వర్లు ఆలయ కమిటీ ముఖ్యులు తోట హనుమంతు ఎడ్ల రాజేశ్వర్, తుమ్మనపల్లిలక్ష్మణ్, జోగు రాజేశ్వర్,సింగు ప్రవీణ్ మాజీ హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు రాచముల రాజశేఖర్, బాల సంకుల రాజేందర్,భవాని రాజేశ్వర్ సింగు లక్ష్మీనారాయణ లతో పాటు పలువురు హనుమాన్ భక్తులు వివిధ యువజన సంఘాలు తదితరులు సౌకర్యాలను సమకూర్చునున్నారు

# కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని భర్తరఫ్ చేయాలి

## బండి కుమారుడి ని వెంటనే అరెస్ట్ చేయాలి

## ఇచ్చోడ లో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు ధర్నా, రాస్తారోకో





**ఇచ్చోడ, మే 11,(ప్రజాజ్యోతి)** కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను వెంటనే బర్తరఫ్ చేసి, బండి సంజయ్ కొడుకుని వెంటనే అరెస్ట్ చెయ్యాలని బిఆర్ ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవా రం ఇచ్చోడ మండల కేంద్రం లో ఇచ్చోడలో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ధర్నా, రాస్తా రోకో నిర్వహించారు. ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక మైనర్ బాలిక అని తెలిసి కూడా బండి సంజయ్ కుమా రుడు అత్యాచారానికి ఒడిగ ట్టాడని, బీజేపీ పార్టీకి ఏమా త్రం చిత్తశుద్ధి ఉన్నా బండి సం జయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని,పోక్సో కేసులో నిందితుడైన కేంద్ర మంత్రి కొడుకుపై కఠిన చర్యలు తీసుకుని, ఆ బాలిక కు న్యాయం జరిగేలా చూడా లని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో ఎఫ్ ఐ ఆర్ చేసి 3 రో జులు గడిచినా ఇప్పటికీ అరె స్ట చేయరా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పో క్సో కేసు వ్యవహారంలోనూ సై బరాబాద్ పోలీసులు విచిత్ర ధోరణి అవలం బిస్తున్నారని, సాధారణంగా మైనర్ పై ఎవరై నా అఘాయిత్యాలకు పాల్ప డినట్టు ఫిర్యాదులు అందిన వెంటనే ఆరోపణలు ఎదుర్కొ నే వ్యకిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సదరు వ్యక్తిని పిలిపించి విచారిస్తారు.కానీ బండి భగీర థ్ కేసు వ్యవహారంలో చూపి స్తున్న ఉదాసీనత సామాన్యు లపై మాత్రం కనిపించదని, లైంగిక దాడి కేసు లేదా పోక్సో కేసు నమోదైనప్పుడు వెంటనే ఆరోపణలు ఎదుర్కొనే వ్యక్తిని పిలిపించి విచారణ మొదలు పెడతారని, విచారణ పేరుతో నిజాలను రాబట్టేందుకు నింది తుడికి చుక్కలు చూపిస్తారని, కానీ లైంగిక వేధింపులకు సంబంధించి ఆరోపణలు ఎదు ర్కొంటున్న భగీరథ్‌పై ఎఫ్ ఐ ఆర్ నమోదై మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కనీ సం నిందితుడిని పిలిపించి వి చారించే సాహసం పోలీసులు చేయలేదు అని అన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజెపి కలిసి బండి సంజయ్ కొడుకు ని కాపాడుతున్నారని విమర్శించారు. వెంటనే బండి సంజయ్ కొడుకుని అరెస్ట్ చేసి, బండి సంజయ్ ను బర్తఫ్ చెయ్యాలని ఇచ్చోడ మండల కేంద్రంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో పా ర్టీ మండల అధ్యక్షులు కృష్ణా రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మాజీ సర్పంచ్ ముం డే పాండురంగ్, నర్వాడే రమే ష్, సర్పంచ్ అల్తాఫ్, సర్పంచ్ ఆజీజ్, సర్పంచ్ ప్రవీణ్, సాబీ ర్, ప్రవీణ్, గణేష్, లక్ష్మి బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బండి భగీరత్‌ను వెంటనే అరెస్టు చేయాలి

**-- బిఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు**



**నెరడిగొండ, మే 11 ప్రజాజ్యోతి,:** మైనర్ బీసీ మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడి, పోక్సో కేసు నమోదైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్‌ను తక్షణమే అరెస్టు చేయాలని నేరడిగొండ మండల బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశానుసారం సోమవారం వారు నెరడిగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ.. అధికార బలంతో తప్పు చేసిన వారు తప్పించుకోలేరని, చట్టం ముందు అందరూ సమానమేనని పేర్కొన్నారు. మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఇందులో మండల పార్టీ అధ్యక్షులు, అల్లూరి శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వడూర్ సర్పంచ్ ఆడేపు శ్రీకాంత్ స్థానిక ప్రజాప్రతినిధులు మరియు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమనుజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యం లో చలి వేంద్రము ఏర్పాటు

మజ్జిగ పంపిణీ




**ఆదిలాబాద్ టౌన్, మే 11, (ప్రజా జ్యోతి)** సామాన్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఆదిలా బాద్ జిల్లా కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం తో పాటు దాహంతో అల్లాడు తున్న పేద ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశారు. ఆదిలాబాద్ లోని ఠాకూర్ హోటల్, బస్టాం డ్, రైల్వే స్టేషన్ సమీపంలో సమనుజ్ఞ ట్రస్ట్ అధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రా రంభించారు. ట్రస్ట్ చైర్మన్, కె.విశ్వనాథ్ న్యాయవాది, ఆర్ టి సి డిఎం ప్రతిమారెడ్డి సురం తిరుపతిరెడ్డి ప్రైవేట్ ఆర్టీసీ ఎయిర్బస్ ఓనర్ స్టేట్ సెక్రెటరీలు ప్రారంభించా రు. మంచినీటి చలివేంద్రం తో పాటు మజ్జిగ పంపిణీ కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీసీ డిఎం ప్రతిమారెడ్డి హాజరై మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ట్రస్టు సభ్యులు సోనీ, కుర్మి వెంకట్ రమణ, మోతి సుధాకర్, గిరిబాబు యాదవ్, సయ్యద్ ముజఫర్, పసుపుల మణికంఠ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దీంట్లో పెద్ద సంఖ్యలో ట్రస్ట్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం అనంతరం ట్రస్ట్ చైర్మన్ కె. విశ్వనాథ్ న్యాయ వాది మాట్లాడుతూ మే నెలలో ఎండలు ముదురుతున్న దృష్ట్యా పల్లెల నుండి పట్టణానికి వస్తున్న గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఈ చలి వేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలో గల బస్టాండ్ వద్ద రాక, పోకలు జరిపే ప్రజలు ఎక్కువ ఉండటంతో వారికి సౌకర్యార్థం చలివేంద్రము ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గుడ్ల రంజిత్ నియామకం

**లక్ష్మణ చాంద, మే 11 (ప్రజా జ్యోతి)** తెలంగాణ న్యాయ సేవ ప్రజా చైతన్య సమితి సెక్షన్ 2005 చట్టంరాష్ట్ర వ్యాప్తంగా విస్తరణ బలోపేతం నిమిత్తం రాష్ట్ర కమిటీ సూచన మేరకు వ్యవస్థాపకులు మరియు రాష్ట్ర అధ్యక్షులు చాపల కిరణ్ కుమార్ ఆమోదం తో రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీ పుచ్చుల నాగేష్ నిర్మల్ జిల్లా లక్ష్మణ చందా మండల సభ్యుడిగా గుడ్ల రంజిత్ ను సోమవారం రోజున లక్ష్మణ చాంద గ్రామ వాసిని నియమించడం జరిగింది. వీరు అంకితభావము నిబద్ధతతో పని చేసి సమితి భావజలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి సమాచార హక్కు చట్టం నీ బలోపేతం చేసి ప్రతి ఒక్కరికి సమాచార హక్కు చట్టం 2005 పై కృషి చేయాలనీ న్యాయ సేవా ప్రజా చైతన్య సమితి వారు స్వాగతం పలికారు.



## ఘనంగా జనగణన-2027 'సెన్సస్ వాక్'

ప్రారంభించి పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్ బ్యూరో, మే 11 (ప్రజా జ్యోతి)** వికసిత్ భారత్ 2047 లక్ష్యం గా సాగుతున్న జనగణన- 20 27 ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జి ల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపు నిచ్చారు. సోమవారం ఉద యం స్థానిక ఇందిరా ప్రియద ర్శిని స్టేడియం నుండి కలెక్టరే ట్ వరకు నిర్వహించిన సెన్స స్ వాక్/మారథాన్', అవగాహ న ప్రచార రథాన్ని ఆయన జెం డా ఊపి ప్రారంభించి పాల్గొని ప్రజల్లో చైతన్యం నింపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, జిల్లాలో ముగిసిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ద్వా రా సుమారు 12,000 కుటుం బాలు తమ వివరాలను తా మే నమోదు చేసుకున్నాయని వెల్లడించారు. నేటి నుండి జూ న్ 9 వరకు జరిగే మొదటి దశ హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్స స్ అత్యంత కీలకమని, జిల్లా లోని 1,293 బ్లాకుల్లో ఎన్యు మరేటర్లు వివరాలు సేకరిస్తా రని తెలిపారు. క్షేత్రస్థాయిలో వచ్చే సిబ్బందికి ప్రజలు ఎటు వంటి భయం లేకుండా సమా చారం అందించాలని సేకరించి న సమాచారం డేటా ప్రైవసీ చట్టాల ప్రకారం అత్యంత గో ప్యంగా ఉంటుందని, ఇది కేవ లం ప్రభుత్వ అభివృద్ధి పథకా ల రూపకల్పనకే ఉపయోగప డుతుందని స్పష్టం చేశారు. ఎ న్యుమరేటర్లు అడిగే 34 ప్రశ్న లకు యదార్థమైన సమాధానా లు చెప్పాలని, సెల్ఫ్ ఎన్యూ మరేషన్ చేసుకున్న వారు త మ ఎ ఈ-ఐడి ని చూపిస్తే ప్రక్రియ వేగవంతం అవుతుం దని సూచించారు. జిల్లా అధి కారుల పర్యవేక్షణలో సాగు తున్న ఈ జాతీయ యజ్ఞంలో ఆదిలాబాద్ జిల్లాను ఆదర్శం గా నిలపాలని కలెక్టర్ అధికా రులను ప్రజలను కోరారు.ఈ ర్యాలీలో అదనపు కలెక్టర్లు ఆ ర్. ఎస్.చిత్రు, రాజేశ్వర్, డి ఆ ర్ఓ స్రవంతి, డివైఎస్ఓ శ్రీ ని వాస్, ఈడి మనోహర్, మెప్మా పిడి రాజు, పర్యవేక్షకురాలు నలంద ప్రియ, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, ప్రజలు, ఉద్యోగులు, యువత, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వే ప్రారంభం: ప్రతి గడపకూ గణన సిబ్బంది



**సోనాల. మే 11: (ప్రజాజ్యోతి)** సోనాల మండలంలోని చింతలబోరి గ్రామంలో ప్రతిష్టాత్మకమైన 'సమ గ్ర ఇంటింటి సర్వే' ( జనగణన) నేటి నుంచి అధికారికంగా ప్రారం భమైంది. రాష్ట్ర ప్రభు త్వం అత్యంత కీలకం గా భావిస్తున్న ఈ సర్వే ప్రక్రియ వచ్చే నెల జూన్ 9వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం యొక్క సామాజిక, ఆర్థిక, విద్యా మరియు ఉపాధి వివరాలను సేకరించనున్నారు.మే 11 నుండి జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని సర్వే సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర సర్వే సిబ్బంది తో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రి ని కలిసిన మాజీ ఎంపీ సోయం

జిల్లాలో పలు గిరిజన గ్రామాలకు రోడ్లు మంజూరు చేయాలని వినతి



**ఆదిలాబాద్ బ్యూరో, మే 11, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన ప్రారంభించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు విజ్ఞప్తి చేశారు.రోడ్డు పనులను మంజూరు చె య్యాలని, ప్రారంభించిన ప నులకు నిధులు విడుదల చె య్యాలని, ఆర్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సో యం బాపూ రావు కోరారు.సోమవారం హైదరాబాద్ లోని ఆర్ బీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సో యం బాపూరావు, మాజీ డి సి సిబి చేర్మెన్ అడ్డి భోజా రెడ్డిలు కలిసి బోథ్ నియోజకవర్గంలోని భీంపూర్ మండలంలో రోడ్డు పనులను మంజూరు చెయ్యాలని కోరారు. నేషనల్ హై వే నుంచి అర్లి టీ గ్రామం వరకు ప్రారంభించిన రోడ్డు పనులకు గాను మిగిలిన 9 కోట్ల నిధులు విడుదల చెయ్యాలని, కొత్తగా అర్లి టీ నుండి గుబిడి పల్లి వరకు అధ్వాన్నంగా ఉన్న రోడ్డు పనులను త్వరిత గతిన ప్రారంభించి 25 కోట్లని ధులను మంజూరు చెయ్యాల ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాంసి మండలం లోని సావ ర్గం గ్రామంలో బీసీ భవనం, భీంపూర్ మండల కేంద్రంలో ఎస్టీ భవనం, అర్లిటి గ్రామంలో ఎస్సి భవనం నిర్మాణాల కో సం నిధులు మంజూరు చెయ్యాలని మంత్రిని కోరగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే నిధులు మం జూరు చేసి పనులను ప్రారం భిస్తామని హామీ ఇచ్చారని మాజీ ఎంపీ సోయం బాపూ రావు తెలిపారు.

## ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే

-పాల్గొన్న ఉపాధ్యాయ బృందం



**నేరడిగొండ, మే 11 ( ప్రజాజ్యోతి ):**మండలంలోని కుమారి గ్రామంలో సోమవారం సమగ్ర తెలంగాణ గృహాల గణన (సర్వే) కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల బృందం గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను సేకరిస్తున్నారు.గ్రామానికి ఎన్యుమరేటర్లుగా మరియు సూపర్వైజర్లుగా నియమించబడిన ఉపాధ్యాయులు ఈ జాబితాను రూపొందిస్తున్నారు. సోమవారం ఉదయం గ్రామ వీధుల్లో పర్యటించిన బృందం, గృహాల నంబర్లను నమోదు చేస్తూ గణన ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆడెపు రవి, కారోబార్ రాజు, ఉపాధ్యాయులు గంగా సింగ్, శివ లీల, ఇతర ఉపాధ్యాయ బృందం మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. సర్వేకు వచ్చే సిబ్బందికి గ్రామస్తులు సహకరించి సరైన వివరాలు అందించాలని ఈ సందర్భంగా కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు మంజూరు చేయండి

కలెక్టరేట్ ఎదుట లబ్ధి దారుల నిరసన

భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల్



**ఆదిలాబాద్ బ్యూరో, మే 11, (ప్రజా జ్యోతి)** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపు బిల్లులను తక్షణమే విడుదల చేయాలని లబ్ధిదారులు డి మాండ్ చేశారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో స్థానిక కలెక్టరే ట్ ఎదుట భీం ఆర్మీ జిల్లా కమి టీ ఆధ్వర్యం లో అదిలాబాద్ రూరల్ మం దలంలోని పెద్ద సల్పల గూడ, చిన్న సల్పల గూడ, గుండం లొద్ది, మావుల మండలంలోని వాగాపూర్ గ్రా మాలకు చెందిన ఆదివాసి కోలం తెగకు చెందిన ఇందిరమ్మ లబ్ధిదారుల తో కలిసి భీం ఆర్మీ జిల్లా కమిటీ అధ్యక్షుడు షేక్ షకీల్ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నియమ నిబం ధనలతో ఎన్నో కష్టాలు ఎదుర్కొని కట్టుకుంటే ఫైనల్ బిల్ రాకపోవడంతో ఇటు వర్షాకాలం సమీపిస్తున్నందున అదిలాబాద్ రూరల్ మండలంలో ని పెద్ద సల్పలగూడ చిన్న సల్పల గూడ, గుండం లొద్ది, గ్రా మాలతో పాటు, మావల మండలంలోని వాగాపూర్, అది లాబాద్ అర్బన్ లో కూడా ఫై నల్ బిల్లులు రాక లబ్ధిదారు లు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే ఫైనల్ బిల్లు వెంటనే మంజూరు అయ్యేలా చూడా లని, రెండవ విడత ఇందిర మ్మ ఇళ్లు మంజూరు కానీ పే దలకు మంజూరు చేయాలని పేదలకు అండగా భీమ్ ఆర్మీ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు .బిల్లులు మంజూరు చేయకపోతే రానున్న రోజుల్లో నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మ హిళా అధ్యక్షురాలు అనిత కాంబ్లే అడ్వైజర్ హర్షత్, వాడు ప్రెసిడెంట్ డి జగన్, లబ్ధిదారులు మడావి రాము, కోడప పోత, సిడామ్ జంగు, మడావి అయ్యో బాయి, సిడామ్ కాంతా బాయి, రాజు భాయి, భీమ్బాయి, జంగు బాయి తదితరులు పాల్గొ న్నారు.

# ప్రభుత్వ కళాశాలలో విద్యార్థు లు చేరి బంగారు భవిష్యత్తు కు లు బాటలు వేయాలి

**ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 11, (ప్రజా జ్యోతి)** అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసి ప్రభుత్వం కొన సాగిస్తున్న కళాశాలలో విద్యార్థులు చేరి బంగారు భవిష్య త్తుకు బాటలు వేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ పిలుపు ని చ్చారు.సోమవారం పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళా శాలలో ఏర్పాటు చేసిన విద్యా వారోత్సవాల ప్రారంభం కార్యక్రమంలో ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ప్రిన్సిపాల్ డా.జె సంగీతతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ప్ర వేశాలకు సంబంధించిన కరప త్రాలు, వాల్ పోస్టర్లు ఆవిష్క రించారు. కళాశాల సదుపా యాలు సద్వినియోగం చేసు కోవాలని కోరారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరిత గతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 11 (ప్రజా జ్యోతి)** జిల్లా లో ప్రభుత్వ సంక్షేమ కార్య క్రమాల అమ లులో ఎలాం టి నిర్లక్ష్యం సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రజా ఫిర్యాదుల ను నిర్దిష్ట గడువులోగా పరి ష్కరించడం అధికారుల ప్రా ధాన్య కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు.సోమవారం కలెక్ట రేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిర మ్మ ఇళ్ల మంజూరు, సామాజి క భద్రతా పెన్షన్లు, ఉపాధి హా మీ పనులు, భూ భారతి సమ స్యలు తదితర అంశాలకు సం బంధించి మొత్తం 75 ఫిర్యా దులు అందినట్లు తెలిపారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా నిర్వహించి న సమీక్షా సమావేశంలో కలెక్టర్ మా ట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందే ప్రతి ఫిర్యాదును 30 రో జుల్లోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో ఎంపీడీ వోలు, ఇతర అధి కారులు క్షేత్రస్థాయిలో పర్యవే క్షణ చేపట్టి, సమస్యలపై తీసు కున్న చర్యల నివేదికలను స మయానికి పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. పదేపదే ఒకే సమస్యపై ఫిర్యాదులు రావడం జరుగకుండా శాశ్వత పరిష్కారాల పై దృష్టి సారించాలని అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారం లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ ప్రజావాణి కార్య క్రమంలో అదనపు కలెక్ట ర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, డిఆర్ఓ స్రవంతి, డీ ఆర్ డీవో రవీందర్, డీ ఏండబ్ల్యూఓ కలీం, తహసీల్దార్ శ్రీనివాస్,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ పరిశ్రమ విద్యుత్ శాఖ కు 18 కోట్ల బకాయిలు

**వసులు చేశాకే డిస్ మెంటల్ పనులకు అనుమతివ్వాలి**

**విద్యుత్ఎస్.ఈ కార్యాలయం ముందు సీసీఐ సాధన కమిటీ ధర్నా**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 11, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరే షన్ అఫ్ ఇండియా సీసీఐ ప రిశ్రమ 18 కోట్లు విద్యుత్ బకా యిలు పడి వున్నాయని, అవి విద్యుత్ శాఖ వసూళ్లు చేయ క పోవడాన్ని నిరసిస్తూ సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో వి ద్యుత్ శాఖ ఎస్.ఈ . కార్యాల యం ముందు ధర్నా నిర్వహిం చారు .ఈ సందర్బంగా సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శ నాల మల్లేష్ , కో కన్వీనర్ కొం డా రమేష్ ,దాసరి రమేష్ లు మాట్లాడుతూ సామాన్యులు వెయ్యి రూపాయలు బకాయి ఉంటేనే కరెంట్ మీటర్లు కట్ చేసి చీకట్లో ఉంచే విద్యుత్ శా ఖ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సిమెంట్ కార్పొరేషన్ అఫ్ ఇండియా సీసీఐ 18 కో ట్లు బకాయి పడినా వసూలు చేయక పోవడంలో ఆంతర్యం ఏమిటనీ ప్రశ్నించారు .ఒక పక్క కేంద్ర ప్రభుత్వం సీసీఐ స్క్రాప్ కింద అమ్మేస్తుంటే బ కాయిలు రాబట్టుకోవాల్సిన స మయంలో నిర్లక్ష్యంగా వ్యవ హరించడం సరైనది కాదని విమర్శించారు. వెంటనే సీసీ ఐ యాజమాన్యానికి నోటీస్ పంపించాలని, స్క్రాప్ పనులను అడ్డు కోవాలని వారు డి మాండ్ చేశారు. సామాన్యులకు ఒక న్యాయం ప్రభుత్వ సంస్థ లకు మరొక న్యాయమా అంటూ ప్రశ్నిచారు. బకాయిలు రాబ ట్టేంత వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ జగన్ సింగ్, ఈశ్వర్ దాస్ నాయకులు లోకరీ పోశెట్టి, బండి దత్తాత్రి, పూసం సచిన్ ఆర్ మంజుల ఆర్ సురేందర్ స్వరూపా రాణి, మమత, కరుణ, పర్వీన్ సుల్తాన్ ఎన్ స్వా మి, డి .స్వామి ,అరిఫాబేగం, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ చేతుల మీదుగా కంటి స్కానింగ్ యంత్రాల పంపిణీ



**ఆదిలాబాద్ బ్యూరో, మే 11 (ప్రజా జ్యోతి)** సదరం క్యాంపులకు వచ్చే చి న్నారులకు కంటి పరీక్షలు నిర్వహించి, వైకల్య శాతాన్ని ఖ చ్చితంగా నిర్ధారించేందుకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అ త్యాధునిక స్కానింగ్ యంత్రాలను సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యులకు అందజేశారు. ఈయం త్రాలను సెర్ప్ సీఈఓ ద్వారా హైదరాబాద్ నుండి పంపించ గా, వీటిని ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ నుండి ప్రత్యేకంగా తీసుకురావటం జరిగింద న్నారు. ఈ పరికరాల వల్ల జిల్లాలో కంటి వైద్య సేవలు మ రింత వేగవంతం కానున్నాయ ని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అద నపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రూ, డిఆర్ఓ స్రవంతి, డిఆర్డీఓ రవీందర్, డిహెచ్ఎంహెచ్ ఓ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, ఏపీఓ శేషారావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ నూతన వ్యవసా య మార్కెట్ కమిటీ చైర్మన్ ను సన్మానించిన డీసీసీ అధ్యక్షుడు



**ఆదిలాబాద్ బ్యూరో, మే 11, (ప్రజా జ్యోతి)** ఇటీవల ఆదిలాబాద్ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మ న్ గా నియమితులైన బోరం చు శ్రీకాంత్ రెడ్డి ని డిసిసి అ ధ్యక్షుడు నరేష్ జాదవ్ శాల్వా కప్పి ఘనంగా సన్మానించారు. ఈయన తో పాటు వైస్ చైర్మన్ తన్వీర్, మార్కెట్ కమిటీ డైరె క్టర్లని సైతం సన్మానించి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా నరేష్ జాదవ్ మాట్లాడుతూ నూతనంగా నియమితులైన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గా నికి శుభాకాంక్షలు తెలుపు తూ నూతన పాలక వర్గం మా ర్కెట్ కు వచ్చే రైతుల సమస్య లను పరిష్కరిస్తూ ఆదిలాబా ద్ మార్కెట్ అభివృద్ధి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో వారితోపాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు కార్యకర్త లు పాల్గొన్నారు.

# చదువుతో నే సమాజంలో గుర్తింపు

**ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ అనూష సతీష్**

**డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కరపత్రాలు విడుదల**



**ఆదిలాబాద్ టౌన్, మే 11, (ప్రజా జ్యోతి)** యువతీ యువకులు మంచి ఉన్నత చదువులు చదివి, ఉన్నతులుగా రాణించాలని, సమాజంలో చదువతోనే మంచి గుర్తింపు లభిస్తుందని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ అనూష సతీష్ అన్నా రు.ఆదిలాబాద్ లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళా శాలలో నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష స తీష్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ప్రవేశలకు సంబంధిం చిన కరపత్రాలను ప్రిన్సిపాల్ అతీక్ బేగం, అద్యాపకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ను కళాశాల తరపున స న్మానిం చారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ చదువు తోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. చదువు కుంటేనే సంస్కారం, సమాజం లో విలువలు పెరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నత లక్ష్యాలకు చేరుకో వాలన్నారు. ప్రజలు సైతం తమ పిల్లలను ఉన్నత చదువు లు చవించేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌళిక వసతులు కల్పించడం జరుగుతుందని, వీటిని సద్వినియోగం చేసు కో వాలని కోరారు. విద్యా ప్రాము ఖ్యత గురించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ జీవి తంలో వెనుక డుగు వేయవ ద్దని, తమ సహాయ సహకారా లు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. అనంతరం ఆమె కరపత్రాలు పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో క ళాశాల వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, కోఆర్డినేటర్ ఏం. కో టయ్య, చంద్ర కాంత్, ముబా రక్, బండారి సతీష్, స్వప్న, అనిత, నరేశ్, కునల్ కళాశాల బృందం పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియ ను వేగవంతం చేయాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధి కారి సుదర్శన్ రెడ్డి**

**ఆదిలాబాద్ బ్యూరో, మే 11, (ప్రజా జ్యోతి)** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదే శించారు. సోమవారం హైదరా బాద్ నుండి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతి పై ఆయన సమీక్షించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎ న్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించా రు. పొరుగు రాష్ట్రాలతో పోల్చిచూస్తే మన రాష్ట్రం ఇంకా వెనుకబడి ఉందన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాల ను ప్రోత్సహించి, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవ సరమైన డేటా ఎంట్రీ ఆపరేట ర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాల ని, ప్రతిరోజూ ఫారాల పంపి ణీ, సేకరణపై సమీక్ష నిర్వహి స్తామని తెలిపారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీ సుకోవాలని, ఏ నిజమైన ఓట రు తన ఓటు హక్కు కోల్పో కుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా వీఐపీ, వీవీ ఐ పీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.




మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సం ఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించు కోవా లని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ కార్యా లయంలోని వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబం ధిత అధికారులతో కలిసి హా జరయ్యారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రతి నియోజకవర్గం లో బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూ ర్తి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డి ఆర్ ఓ స్రవంతి, ఆర్డీవో జగదీశ్వర్ రావ్, ఇతర సంబంధిత అధి కారులు, తదితరులు పాల్గొ న్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత





**జిల్లా కలెక్టర్ రాజర్షిషాలి**

**ఆదిలాబాద్ బ్యూరో, మే 11 (ప్రజా జ్యోతి)** దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య తనిస్తోందని జిల్లా కలెక్టర్ రా జర్షి షా అన్నారు. ప్రజాపాలన -ప్రగతిప్రణాళిక విద్యా వారో త్సవాల్లో భాగంగా సోమవా రం స్థానిక డైట్ కళాశాల ఆవ రణలో విద్యాశాఖ, సమగ్ర శిక్షా, ఎలింకో సంస్థల సంయు క్త ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగ చిన్నారులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 250 మంది దివ్యాంగ చిన్నారులకు వారి అవసరాలకు తగినట్లుగా వివి ధ రకాల సహాయక పరికరాలను పంపిణీ చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. వారి కోసం గతంలో నిర్వహించి న రిజిస్ట్రేషన్ల ద్వారా ఇప్పటికే సదరం సర్టిఫికేట్లు, పెన్షన్ల స మస్యలను పరిష్కరించామ ని, ఇంకా పెన్షన్లు రాని అర్హు లైన చిన్నారులందరికీ త్వర లోనే మంజూరు చేస్తామని హా మీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలో దివ్యాంగ చిన్నారుల కోసం సుమారు ?2 కోట్లతో ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాల వసతి కల్పించేందుకు సి.ఎస్.ఆర్ ని ధుల ద్వారా ప్రతిపాదనలు సి ద్ధం చేశామని వెల్లడించారు. చిన్నారుల భవిష్యత్తు కోసం వారిని క్రమం తప్పకుండా భ వితా కేంద్రాలకు, పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలలకు రాలేని స్థితిలో ఉన్న పిల్లలకు 'హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్' అం దిస్తామని, ప్రతి గురువారం వై ద్యుల ద్వారా స్పీచ్ థెరపీ వం టి సేవలు అందుబాటులో ఉం టాయని వివరించారు. చిన్నారులు ఈ ఉపకరణాలను వా డుతూ నిరంతరం అభ్యాసం చేయడం ద్వారా మెరుగైన ఫ లితాలు సాధించవచ్చని ఆ కాంక్షించారు. ఆర్థిక స్వావలం బన దిశగా 18 ఏళ్లు నిండిన దివ్యాంగులకు లేదా వారి త ల్లిదండ్రులకు కిరాణా దుకాణా లు, జిరాక్స్ సెంటర్లు వంటి చి న్న తరహా యూనిట్ల ఏర్పాటు కు ఆర్థిక పునరావాస పథకాల కింద మద్దతు ఇస్తామని, అర్హులు ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలని కోరారు. అనం తరం కలెక్టర్ అధికారులతో క లిసి దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సం స్థల అదనపు కలెక్టర్, ఇంచా ర్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, కోఆర్డినేటర్ తిరుప తి, ఏంఈఓ సోమయ్య, ఎలిం కో ప్రతినిధులు రోహిణి, దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు, అధికారులు, సి బ్బంది, తదితరులు పాల్గొన్నా రు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ను వెంటనే అరెస్టు చేయాలి

**పోలీస్ స్టేషన్ లో బిఆర్ ఎస్ నాయకుల ఫిర్యాదు**



**సిరికొండ, మే 11,( ప్రజా జ్యోతి)** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినందుకు నిరసిస్తూ సిరికొండ పోలీస్ స్టేషన్లలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. బండి సం జయ్ కుమారుడు బండి భగీ రథను వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డి మాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు ఓరగంటి పెంటన్న మాట్లాడు తూ లైంగిక దాడి ఘటనకు నైతి క బాధ్యత వహిస్తూ బం డి సంజయ్ కుమార్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని అన్నారు. బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ పై స్థానిక పోలీస్ స్టేష న్లో ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఏఎస్ ఐబలిరాంకు ఫిర్యాదు పత్రం అందజేసి కేసు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకు లు సునీల్,మలా రెడ్డి, మల్లే ష్, ఆవుల రాజేష్, సూర్య వంశం రాజేందర్, మల్లేష్, రాజు, గణేష్ , నరేష్ పార్టీ నా యకులు కార్యకర్తలు తదిత రులు పాల్గొన్నారు.

## ఇచ్చోడ నూతన ఎస్హెచ్ఓ గా కే నరేష్

**జిల్లా ఎస్పీకి పూల మొక్క అందజేసి బాధ్యతల స్వీకరణ**

**అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని ది శా నిర్దేశం**



**ఇచ్చోడ,మే 11, (ప్రజా జ్యోతి)** సాధారణ బదిలీల్లో భాగంగా ఇచ్చోడ కు నూతన ఎస్ హెచ్ ఓ గా సీఐ కే నరేష్ సోమవా రం పట్టణంలోని పోలీసు ముఖ్య కార్యాల యంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసే బాధ్య తలను స్వీకరించారు. గతంలో ఉట్నూర్ సర్కిల్ ఇన్స్పె క్టర్ గా పనిచేసిన నరేష్, ఇది వరకు జగిత్యాల జిల్లా నుండి ఆదిలాబాద్ జిల్లాకు విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇచ్చోడ మండల పరిధిలో ఎ లాంటి అసాంఘిక కార్యకలా పాలు జరగకుండా, అక్రమ రవాణాలో జరగకుండా పర్య వేక్షించాలని తెలిపారు. ఇది వరకే పనిచేసిన ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ బండారి రాజు వరంగ ల్ కమిషనరేట్ కి బదిలీపై వెళ్ల డం జరుగుతుంది.

## ఈవీఎం గోడాన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్




**ఆదిలాబాద్ బ్యూరో, మే 11, (ప్రజా జ్యోతి )** ప్రతి నెల తనిఖీలో భాగంగా సోమవారం శాంతినగర్ లోని ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవే క్షకురాలు నలంద ప్రియా, సిబ్బంది, తదితరులు.